

సైకిల్ జోరు.. ఫ్యాన్ బేజారు..

టీడీపీ-జనసేన,బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. అభ్యర్థులు అందరూ గట్టివారే. లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి బరిలో దిగారు. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు,రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చ య్య చౌదరి, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్ ప్రచారంలో దూసుకుపోతు న్నారు. ఇక అనపర్తి సీటు తిరిగి టీడీపీకే దక్కనుంది. ఈ మేరకు రేపో మాపో అధికారిక ప్రకటన రానుంది. దీంతో అక్కడి టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం తిరిగి ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు ప్రచారం వేగవంతం చేశారు. వైసీపీలో ఇంత వరకూ పెద్దనేతల ఎవరూ ప్రచారానికి రాలేదు.కూటమికి ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి ఓ ఊపునిచ్చిన సంగతి తెలి సిందే. టీడీపీలో అసంతృప్తులన్నీ సద్దుమణగగా,వైసీ పీలో మాత్రం ఎవరి దారి వారిదే అన్నట్టు ఉంది. ఒకరినొకరు వెన్నుపోట్లు పొడుచుకుంటున్నారు. ఈ నెల 16న వైసీపీ అధినేత, సీఎం జగన్ సిద్ధం సభ జిల్లాలో ఉండవచ్చని చెబుతున్నారు. కానీ జనసమీకరణ ఎలా అనే సమస్యతో నేతలు తలపట్టుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

బీసీల సంక్షేమం విస్మరించిన జగన్

బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13 : బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత బీసీల సంక్షేమం, వారి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. మళ్లీ అధికారం కోసం బీసీ జపం చేస్తూ అబద్ధాలు చెబుతున్న జగన్ పట్ల బీసీ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఓబీసీ సమాజం అభివృద్ధికి ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారని, బీసీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడానికి, రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో ఎన్‌డీఏ అభ్యర్థిగా తన గెలుపునకు బీసీలంతా ఏకం కావాలన్నారు. అన్ని కుల సంఘాలను కలుపుకుని అత్యధిక మెజార్టీతో గెలిచేలా ఓబీసీ మోర్చా నాయకులు బూత్‌స్థాయిలో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, నాయకులు కురగంటి సతీష్, హారిక, యెనుముల రంగారావు, ఓబీసీ మోర్చా జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.


పోలింగ్ సామగ్రి తరలింపును పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారిణి మాధవీలత

పోలింగ్ సామగ్రి తరలింపు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13 : జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపా రు. రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లో జిల్లా సెంట్రలైజ్డ్ ఈవీఎం గొడౌన్‌లో భద్రపరిచిన ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం, అనుబంధ యూనిట్స్ శనివారం ఆయా నియోజకవర్గాల తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్టు చెప్పారు.అనపర్తి నియోజకవర్గంలో రామారెడ్డి జడ్పీ హైస్కూల్‌కు 273 బ్యాలెట్ యూనిట్స్, 273 కంట్రోల్ యూనిట్స్, 296 వీవీ ప్యాడ్‌లు పంపించారు. రాజానగరం నియోజకవర్గానికి నన్నయ యూనివర్శిటి వెలుగుబందలో 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 259 బ్యాలెట్, 259 కంట్రోల్ యూనిట్స్, 280 వీవీ ప్యాట్స్ తరలించారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు నగరంలో 232 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 285 బ్యాలెట్ యూనిట్స్, 285 కంట్రోల్ యూనిట్స్, 310 వీవీ ప్యాట్స్ పంపించారు. రాజమహేంద్రవరం రూరల్‌కు ధవళేశ్వరం నెక్ హాస్టల్ భవనానికి 264 పోలింగ్ కేంద్రాలకు 324 బ్యాలెట్, 324 కంట్రోల్ యూనిట్స్, 348 వీవీ ప్యాట్స్ పంపించారు. కొవ్వూరుకు మావులేటి సోమరాజు సంస్కృత ఉన్నత పాఠశాల 176 పోలింగ్ కేంద్రాలకు 211 బ్యాలెట్, 211 కంట్రోల్ యూనిట్స్, 228 వీవీ ప్యాట్‌లు పంపించారు. నిడదవోలు జూనియర్ కళాశాలకు 205 పోలింగ్ కేంద్రాలకు 246 బ్యాలెట్, 246 కంట్రోల్ యూనిట్స్, 266 వీవీ ప్యాట్స్‌ను పంపించారు. గోపాలపురం నియోజకవర్గానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు 248 పోలింగ్ కేంద్రాలకు 297 బ్యాలెట్, 297 కంట్రోల్ యూనిట్స్, 322 వీవీ ప్యాట్‌లను పంపించారు. ఆయా స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీల్ వేశారు.ర్యాండమైజేషన్ అనంతరం వాహనాల తరలింపులో ఏడు నియోజకవర్గాల ఆర్‌వోలు తేజ్ భరత్ ,దినేష్ కుమార్, అశు తోష్ శ్రీవాత్సవ్,డీఆర్వో జి.నరసింహులు, ఏ.చైత్రవర్షిణి, కెఎల్ శివజ్యోతి, మాధు రి, ఆర్‌వి రమణా నాయక్, పార్లమెంట్ ఆర్‌వో, సహాయ ఆర్‌వోలు కృష్ణానాయక్ , ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు చిత్రంలో పక్కపక్కనే మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు


గోపాలపురాన కుదిరిన సయోధ్య

- మద్దిపాటితో కలిసిన ముళ్ళపూడి వర్గం
- చంద్రబాబు ఆదేశాలతో సర్దుబాటు చేసిన గన్ని
- అనపర్తి నియోజకవర్గం టీడీపీకే?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని టికెట్ల విషయంలోనూ టీడీపీలో అక్కడక్కడా వినిపించిన అసంతృప్తులు సద్దుమణిగాయి. గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, మాజీ జడ్పీ ఛైర్మన్, టీడీపీ సీనియర్‌నేత ముళ్లపూడి బాపిరాజు మధ్య సయోధ్య కుదిరింది.దీంతో ఇక్కడ నియోజకవర్గంలోని శ్రేణులంతా ఒకటయ్యారు. ఇక్కడ అభ్యర్థి వెంకట్రాజుకు మరింత బలం చేకూరినట్టు అయింది. ఈ మేరకు శనివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. వెంకట్రాజు..బాపిరాజు ఒకే వేదికపై ఆశీనులవ్వగా టీడీపీ నాయకుడు గన్ని వీరాంజనేయులు సయోధ్య కుదిర్చారు. అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు అంతా కలిసి పనిచేయాలని సూచించారు. అంతా ఒక్కటై జై చంద్రబాబు.. జై మద్దిపాటి అంటూ నినాదాలు చేశారు. ఇక అనపర్తి సీటు తిరిగి టీడీపీకే దక్కనుంది. రేపోమాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. మిగతా చోట్ల అంతా బాగానే ఉన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని కూటమి అభ్యర్థులంతా విజయం వైపు దూసుకుపోతున్నట్టు వివిధ సర్వేలు చెబుతున్నాయి. చిన్న చిన్న సమస్యలను ప్రక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంతో అందరూ ఏకమవుతుండడం కూటమికి శుభ పరిణామంగా ప్రజలు భావిస్తున్నారు.

సమయం లేదు.. మిత్రమా!



ఎన్నికలకు మిగిలింది 30 రోజులే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సమయంలేదు మిత్రమా.. రణమా..శరణమా.. సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి.. పోలింగ్‌కు ఇక మిగిలింది నెలరోజులే..ఈ నెల రోజులు ఓటర్ సమయమే.. ఓటరు ఏదనుకుంటే అది చేయవచ్చు.ఎవరిని గెలిపించుకోవాలంటే వారిని గెలిపించుకోవచ్చు..ప్రభుత్వంపై వ్యతి రేకత కారణంగా ఇప్పటికే ఓటరు సన్నద్ధమైపోయాడు. ఈ సారి ఎన్నిక లాంఛనమే అనేది మేధావుల వాదన.. జిల్లాలోని లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికార్లను నియమించారు.ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబం ధించిన అన్ని ఏర్పాట్లను చకచకా చేస్తున్నారు.ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టకుండా చూడడానికి నిఘా పెంచారు. సరిహద్దులు, ముఖ్య కూడళ్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదికవి నన్నయ వర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు.. పోలింగ్‌కు 1569 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను కూడా గుర్తించారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ..

మే 13న పోలింగ్ జరగనుంది.నామినేషన్ల ప్రక్రియకు ఈనెల 18న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. గత నెల 16న ఎన్నికల షెడ్యూల్ రావడం, కోడ్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. 18 నుంచి 25వ తేదీ వర కూ నామినేషన్లు స్వీకరిస్తారు. 26న పరిశీలిస్తారు. 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు.అదే రోజు తుది జాబితా ప్రకటిస్తారు.ఆ రోజు బరిలో ఎవరున్నారో స్పష్టమవుతుంది. మే 13న జిల్లాలో పోలింగ్. జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు. ఆదికవి నన్నయ వర్సిటీలో రెసెప్షన్ కేంద్రం, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీ స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు తదితర ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో దాఖలు చేయాలి. రాజమహేంద్రవరం అర్బన్ అభ్యర్థులు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీసు, రూరల్ అభ్యర్థులు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో, అనపర్తి అభ్యర్థులు అనపర్తి ఎంపీడీవో ఆఫీసు, రాజానగరం అభ్యర్థులు రాజానగరం ఎంపీడీవో ఆఫీసులోనూ, కొవ్వూరు అభ్యర్థులు కొవ్వూరు సబ్-కలెక్టర్ కార్యాలయం, నిడదవోలు అభ్యర్థులు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రామకచేరి కార్యాలయంలో, గోపాలపురం అభ్యర్థులు తహశీల్దార్ కార్యాలయంలో దాఖలు చేయాలి.

- మే 13న పోలింగ్
- ఈ నెల 18 నుంచి నామినేషన్లు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- జోరుగా అభ్యర్థుల ప్రచారం..
- చకచకా సాగుతున్న ఏర్పాట్లు
- తుది జాబితాలో పెరిగిన ఓటర్లు
- జిల్లాలో ఓటర్లు 16.16 లక్షలు
- పురుషులు 7,89,443
- మహిళలు 8,27,380
- రేపటి వరకూ ఓటు నమోదు

ఓటర్లు 16,16,918

జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉండగా ఆ సంఖ్య కొద్దిగా పెరి గింది. ఇప్పటి వరకూ 11,156 మంది ఓటర్లు పెరిగారు.దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య 16,16,918 అయింది. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకూ ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ పురుషులు 7,89,443 మంది, మహిళలు 8,27,380 మంది, థర్డ్ జండర్ 95. గతంలో వీరి సంఖ్య 105 ఉండేది. ఎందుకో పది మంది తగ్గారు.జిల్లాలో పురుషుల కంటే 37,937 మంది మహిళా ఓటర్లు ఎక్కువ. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం రాజమహేంద్రవరం రూరల్.. 2,72,440 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,39,364, పురుషులు 1,33052. థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు..మొత్తం ఓటర్లు 1,83,603 మంది, పురుషులు 89,496 మంది, మహిళలు 94,102 మంది, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ రెండో స్థానంలో ఉంది.2,65,479 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,37,656, పురుషులు 1,27,773 మంది, థర్డ్ జండర్లు 50 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానంలో ఉంది.. 2,41,840 మంది ఉండగా, పురుషులు 1,18,552 మంది, మహిళలు 1,23,283 మంది, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. అనపర్తి నాలుగో స్థానంలో ఉంది. 2,25,188 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,10,125, మహిళలు 1,15,060, థర్డ్ జండర్ ముగ్గురు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. 2,15,584 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,06,473, మహిళలు 1,09,107 మంది, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,12,784 పురుషులు 1,03,972, మహి ళలు 1,08,808, ట్రాన్స్‌జెండర్స్ నలుగురు ఉన్నారు. కొవ్వూరు అతి తక్కువ ఓట ర్లతో చివరి స్థానంలో ఉంది..

336 సమస్యాత్మక కేంద్రాలు..

రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలు ఉండగా అతిసమస్యాత్మక 10, 50 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలకు 67 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. రాజమ హేంద్రవరం సిటీలో 232 కేంద్రాలకు 13 అతిసమస్యాత్మక, 36 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. రూరల్‌లో 264 కేంద్రాలకు అతిసమస్యాత్మక 7, సమ స్యాత్మక కేంద్రాలు 15 ఉన్నాయి. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలకు 35 సమస్యాత్మక, నిడదవోలులో 205 కేంద్రాలకు 41 సమస్యాత్మక, గోపాలపురంలో 248 కేంద్రాలకు 62 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి.మొత్తం జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు ఉండగా అతిసమస్యాత్మక 30 కేం ద్రాలు 306 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్య తలు అప్పగించారు.ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569 మంది, ఇతర పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని నియమించారు.

రాజీ డ్రామాలు!

వలంటీర్ల జీవితంతో వైసీపీ ఆటలు

- అధికార పార్టీ నాయకుల బెదిరింపుల ఉచ్చు
- రాజీనామా చేయాలంటూ హుకుం
- ఆగని అరాచకీయం..మరోవైపు ప్రలోభాల వల
- మళ్లీ వైసీపీ వస్తే..అందలమంటూ అబద్ధాలు
- అది జరిగే పని కాదని..వెనక్కి తగ్గుతున్న వలంటీర్లు


రాజీనామాలు చేసి ఏం చేస్తారు? : కోరుకొండలో శుక్రవారం 64 మంది వలంటీర్ల రాజీనామా

ఎంతో కొంత చదువుకున్నారు.. ఖాళీగా ఉండలేక వలంటీర్ ఉద్యోగంలో చేరారు..గత ఐదేళ్లుగా ప్రజలకు దగ్గరయ్యారు. ప్రతి నెలా పింఛన్ డబ్బులు ఎప్పుడు తెస్తారోనని పింఛనుదారులు ఎదురు చూస్తే.. ఏ పథకం సమాచారం మోసుకొస్తారోనని సాధారణ ప్రజానీకం ఎదురుచూశారు.. జగన్ వలంటీర్లను జనానికి అంతలా అలవాటు చేశారు.. వారినే ఉపయోగించి ఎన్నికలకు వెళ్లాలని జగన్ భావించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో వలంటీర్లను విధుల నుంచి తొలగించారు.. ఇదే అదునుగా అధికార పార్టీ నాయకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు పావులు కదుపుతున్నారు.. వలంటీర్లను ఆశపెట్టి రాజీనామాలు చేయించి నయానో భయానో తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ఆరంభించారు.. నాడు కాదు.. నేడూ చదువుకున్న యువతరం జీవితాలతో ఆడుకుంటున్నారు.. ఎన్నికల వేళ ఎవరైనా వలంటీర్లు చిక్కితే.. కేసు నమోదైతే వాళ్ల జీవితం నాశనమైనట్టే సుమా.. వలంటీర్లు తస్మాత్ జాగ్రత్త..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత వలంటీర్లు ఇటీవల రాజీనామాల బాట పట్టారు. నోటిఫికేషన్‌కి ఇంకా అతి కొద్ది రోజులు సమయం ఉండగా ఆ పరంపర మరీ ఊపందుకొంది. అయితే తన సైన్యమని జగన్ చెప్పుకున్న ఉద్యోగులు/సేవకులు ఎందుకు నెల రోజుల నుంచీ ఇలా ప్రవర్తిస్తున్నారు?. పీజీలు చదివి కూడా నెలకు కేవలం రూ.5 వేలకు సేవకు వచ్చిన వలంటీర్లు సరిగ్గా ఐదేళ్ల తర్వాత.. మళ్లీ ఎన్నికల వేళ ఎందుకు ఉద్యోగాలను వదిలేస్తున్నారు?. ఏ వ్యవస్థలోనూ లేని విధంగా మూకుమ్మడిగా ఎందుకు బయటకు వెళ్లిపోతున్నారు?. వైసీపీ నాయకుల ఒత్తిడి, ప్రలోభాల చట్రంలో వలంటీర్లు నలిగిపోతున్నారని ఆ ప్రశ్నలకు జవాబులు వినవస్తున్నాయి.

త్యాగమా? స్వార్థమా?

దేశంలో ఎక్కడా లేని ఓ వ్యవస్థను జగన్ అస్తవ్యస్తంగా సృష్టించారు.లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నెలకు రూ.5 వేలు గౌరవ భృతితో ఉన్నతంగా చదువుకున్న వారిని సైతం రాజకీయ సేవ ఉచ్చులోకి లాగారు. ప్రభుత్వ ఉద్యో గాలకు నోటిఫికేషన్లు లేకపోవడంతో వలంటీరు సేవనే మహాప్రసాదంగా యువత ఎంచుకున్నారు. జాబు చార్టు, ఉద్యోగ భద్రత వంటివేమీ లేకుండా ఐదేళ్ల సమయాన్ని వైసీపీ పాలకులకు ధార పోశారు. ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే పంపిణీ పేరుతో వలంటీర్లను రాజకీయ స్వార్థం కోసం వాడు కున్నారు.ఎన్ని కల వేళ కోడ్ వచ్చిన తరువాత అయినా వదిలారా అంటే అదీ లేదు. వలంటీర్లను ఇక నేరుగా రాజకీయ ప్రయోజనాలకు వైసీపీ పాలకులు వాడుకునే ఎత్తు వేస్తున్నారు. గత ఐదేళ్లుగా కుటుంబాలతో వలంటీర్లకు ఓ మౌన అనుబంధం ఏర్పడింది. దాంతో రాజ కీయంగా లబ్ధి పొంద డానికి వైసీపీ కుతంత్రా లు పన్నుతుంద నడంలో సందేహం లేదు. ఇవన్నీ గమనిస్తున్న జనం విస్తు పోతున్నారు.

వలంటీర్లు లేకపోతే?

వలంటీర్ల గురించి పూర్తిగా తెలుసుకున్న ఎన్నికల సంఘం..వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రక్రియలో వినియోగించకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో జగన్ ఖంగుతిన్నారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో వలంటీర్లతో ఇంటింటా ప్రచారం చేయించుకుందామని జగన్ అనుకొన్నారు. కానీ దానికి ప్రజాస్వామ్యం అడ్డుకట్ట వేసింది. వలం టీర్లు లేకపోతే అసలు పాలనే ఆగిపోతుందనే విధంగా ప్రభుత్వం వలంటీర్లను పురిగొల్పింది. కానీ వలం టీర్లు లేకుండానే ఈ నెల పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. దీంతో వలంటీర్లను జగన్ ప్రతి క్షణం తన స్వార్థం కోసం మభ్యపెడుతున్నారనే విషయం బహిర్గతమైంది. వలంటీర్లకు చంద్రబాబు వ్యతిరేకం కాదు. ప్రభుత్వం నుంచీ వేతనం పొందు తున్న వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా రాజకీయం చేయడం తప్పని మాత్రమే చెబుతున్నారు. పైగా టీడీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లకు నెలకు రూ.10 వేల వేతనంతో పాటు నైపుణ్య శిక్షణ ఇస్తామంటూ హామీ ఇచ్చారు.

రాజీనామా చేస్తారా? లేదా?

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచీ వలంటీర్ల చుట్టూ రాజకీయం అల్లుకుపోయింది. గెలుస్తామనే నమ్మకం సన్నగిల్లడం, జగన్‌తో సహా వైసీపీ నాయకుల మాటలను జనం పట్టించుకోక పోవడంతో వలంటీర్ల 'సేవ'ను ఎలాగైనా ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని వైసీపీ కుట్ర పన్నుతోంది. దీనిలో భాగంగా వలంటీర్లను నయానో భయానో నలిపేస్తున్నారు. కొందరు వైసీపీ నాయకులు నేరుగానే వలంటీర్లపై బెదిరింపులకు దిగుతున్నారు. రాజీనామా చేసి తాము చెప్పినట్టు వింటే రేపు తమ ప్రభుత్వం వస్తే తిరిగి ఉద్యోగాలిస్తామని..రాజీనామా చేయని వాళ్లను తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో మానసికంగా కాస్త నెమ్మదిగా ఉన్నవాళ్లు భయపడి రాజీనామాల బాట పడుతున్నారు. వారిని చూసి మరి కొందరు ఉద్యోగాలు వదులుకుంటున్నారు. సాధారణంగా ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం కంటే మెరుగైన ఉద్యోగం లభిస్తేనో లేకపోతే ఆరోగ్య కారణాల వల్ల రాజీనామాలు చేయడం జరుగుతుంది. కానీ ఎలాంటి బలమైన కారణం లేకుండానే వలంటీర్లు గంపగుత్తగా రాజీనామాలు చేస్తున్నారు. తాత్కాలిక ప్రలోభాలకు ఆశపడి కొందరు, పాలకుల ఒత్తిడి తట్టుకోలేక మరి కొందరు, మనసు చంపుకొని ఇంకొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్టు సమాచారం. రాజీనామాలు చేసిన వారిని నేరుగా రాజకీయాల్లో వినియోగించుకోవాలని వైసీపీ యోచిస్తోంది. అలా జరిగితే జగన్ తన రాజకీయ లబ్ధి కోసమే వలంటీరు వ్యవస్థను నిర్మించుకున్నారనే విషయం నిజమని తేలుతుంది. రాజీనామాలు చేసిన వలంటీర్లను సైతం రాజకీయ ప్రక్రియకు దూరం పెట్టాలని ఇప్పటికే ఎన్నికల సంఘానికి పౌర సంఘాలు లేఖలు రాస్తున్నాయి.

తూర్పులో 700మందికిపైగా

అధినాయకత్వం మౌఖిక ఆదేశాలతో వైసీపీ నాయకులు వలంటీర్లతో రాజీనామాలు చేయించే దాష్టీకాన్ని కొనసాగిస్తున్నారు. వైసీపీ నాయకులు నేరుగా వలంటీర్ల వద్దకు వెళ్లకుండా ఇప్పటికే రాజీనామా చేసిన వాళ్లతో రాయబారం నడిపిస్తు న్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 9 వేల మంది వలంటీర్లు ఉండగా సుమారు 700 మంది వరకూ రాజీనామాలు చేశారు. రాజీనామా చేస్తే భవిష్యత్తులో బాగా 'చూసుకుంటామని', రాజీనామా చేసిన వాళ్లు తాము చెప్పినట్లు చేస్తే నెలకు రూ.25 వేల వరకూ అనధికారికంగా ముట్టజెబుతామని ఆశ పెడుతున్నారు. అయితే ఇక్కడ ఓ విషయం నిగూఢంగా దాగి ఉండడం గమనార్హం. జిల్లాలో 9వేల మంది వలంటీర్లకు పది శాతం మంది కూడా రాజీనామా బెదిరింపులకు లొంగలేదనే విషయం సుస్పష్టం. వైసీపీ ఫ్యాను పనైపోయిందని ప్రజలతో పాటు వలంటీర్లకు కూడా బోధపడడంతో చాలా మంది వలంటీర్లు రాజీనామాలను తిరస్కరిస్తున్నారని సమాచారం. చంద్రబాబు సీఎం అయితే తమ జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని విశ్వసిస్తుండడమే ఇందుకు కారణం.

గ్యాస్ నొప్పి అనుకున్నాడు..

గుండెపోటుతో హోంగార్డు మృతి


కెల్లా సురేంద్ర

రాజానగరం, ఏప్రిల్ 13 : గుండె వద్ద పోటు వస్తోం ది.. అయినా విధులకు వెళ్లే కంగారు..ఏం కాదులే గ్యాస్ నొప్పి అనుకున్నాడు..ఎందుకంటే అతనికి కేవలం 36 ఏళ్లు.. అయితే మోటార్ సైకిల్‌పై అలా విధులకు వెళ్లాడో లేదో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు..రాజానగరం గ్రామానికి చెందిన కెల్లా సురేంద్ర(36) రాజమహేంద్రవరంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై డ్యూటీకి బయలుదేరాడు. ఇంటి వద్ద ఛాతిలో నొప్పిరావడంతో గ్యాస్ నొప్పిగా భావించి లెక్క చేయలేదు. రాజమహేంద్రవరం చేరుకునే సరికి నొప్పి అధికం కావడంతో పోలీసులు,తోటి ఉద్యోగులు హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.సురేంద్ర మరణవార్త విన్న భార్య హతాశు రాలైపోయింది..ఇప్పుడే కదా నా కళ్లెదుటే వెళ్లారు..ఇలా ఎలా జరిగిందంటూ కంగారుపడిపోయింది. భర్త అచేతనంగా పడి ఉండడం చూసి కన్నీటి పర్యంతమైంది. నొప్పి అంటే గ్యాస్ నొప్పి అనుకున్నాను ఇలా జరుగుతుందనుకోలేదని బోరున విలపించింది. తోటి ఉద్యోగులు, స్నేహితులు రాజానగరం చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు. కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు పెద్దలు డిమాండ్ చేశారు.



వాహనం వస్తే.. ఆగాల్సిందే..!

ఎన్నికల వేళ..ముమ్మర తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి.. ఎన్నికల్లో భాగంగా జిల్లా సరిహద్దు.. ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కార్లు, భారీ వాహనాలను తనికీ చేస్తున్నారు. అనుమానం వస్తే ద్విచక్రవాహనదారులను ఆపి తనికీ చేస్తున్నారు. రూ. 50 వేలు మంచి నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాలని చెబుతున్నారు. ఇప్పటికే కడియం మండలం పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ పట్టుకుంటూనే ఉన్నారు. గురువారం రాగి వస్తువులు, చీరలు పట్టుకున్నారు. శుక్రవారం ఒక కంటైనర్‌లో తరలిస్తున్న బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరులోనూ గతంలో నగదు పట్టుకున్నారు. ఇలా స్పెషల్ స్క్వాడ్ ముమ్మర తనికీలు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో శనివారం సిబ్బంది పలు వాహనాలు తనికీ చేశారు. - రాజమహేంద్రవరం సిటీ



కాఫర్ డ్యామ్

వైసీపీకి.. మూడింది!

- రంప ఎన్నికల్లో ప్రధానాంశాలుగా పోలవరం, జీవో నెం.3, అల్లూరి జిల్లా
- అధికార పక్షానికి ఎక్కడికక్కడ నిరసన సెగలు
- చంద్రబాబు హామీతో కూటమి నేతలకు నీరాజనాలు

(రంపచోడవరం)

రంపచోడవరం రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, స్థానిక గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నెం.3 రద్దు అంశాలు కీలకంగానూ ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగానూ మారుతున్నాయి. ఇక జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన అల్లూరిజిల్లా కూడా ఓటర్లను ప్రభావితం చేసే ప్రధాన సమస్యగా మారింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే 371 ఆవాసాల్లో 234 ఆవాసాలు రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్నాయి. రంపచోడవరం డివిజన్‌లో దేవీపట్నం మండలం, చింతూరు డివిజన్లోని విలీన మండలాలు చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు ఉన్నాయి. ఈ 234 ఆవాసాల్లో సుమారు లక్షమంది జనాభా ఉన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మాణంతో ఇందులో ఒక్క దేవీపట్నం మండలంలోని 38 ఆవాసాల్లో ఒక్క తాళ్లూరు మినహా అన్ని ఆవాసాలనూ ఖాళీ చేయించేశారు. విలీన మండలాల్లోని సుమారు 194 ఆవాసాలకు సంబంధించి ఎక్కడా పునరావాస ప్రగతి లేదు. తరలించిన 37 ఆవాసాల నిర్వాసితులకు ఎక్కడా పూర్తిస్థాయి పునరావాసాన్ని కల్పించలేదు.

జీవో నెం.3 ఈ ఎన్నికల్లో కీలకం

ఇక గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజనులకే నూరు శాతం ఉపాధ్యాయ పోస్టులను కల్పించే తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన జీవోనెం. 3 కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. సుప్రీం కోర్టు ఈ జీవోను కొట్టివేయడంతో జనాభా ప్రాతిపదికన మాత్రమే ఉద్యోగాలు స్థానిక గిరిజనులకు దక్కుతాయి. దీంతో గిరిజన వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్లు దాఖలు చేయగా మరో 15 రివ్యూ పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ నెలలోనే ఈ కేసుల విచారణ కూడా సుప్రీంలో జరిగింది. ఈ కేసుల మాట ఎటుంచినా అరకు సభలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఈ జీవో నెం.3పై స్పందించి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక గిరిజనులకు గిరిజన ప్రాంత ఉద్యోగాల్లో నూరుశాతం రిజర్వేషను దక్కే చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు, ప్రభుత్వం మాత్రం ఇంతవరకూ ఈ అంశంపై స్పందించకపోవడం శోచనీయం.

ఈ పోలవరం నిర్వాతుల అంశం, జీవో నెం.3 వ్యవహారం అధికార పార్టీ నేతలను ఇరుకున పెట్టే అంశంగా మారింది. ఎక్కడికక్కడ ఆయా నేతలకు నిరసన సెగలు తగులుతూనే ఉన్నాయి. ఇక అల్లూరి జిల్లా ఏర్పాటు అంశం కూడా ఈ నియోజకవర్గ ప్రజానీకాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈ సమస్యను తీర్చే విధంగా రంపచోడవరం, పోలవరం గిరిజన నియోజకవర్గాలను కలుపుతూ పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే దేశం అధినేత హామీ ఇచ్చారు. చంద్రబాబు హామీతో ఇక్కడ కూటమి అభ్యర్థులకు నీరాజనాలు పడుతున్నారు. మొత్తంగా పోలవరం నిర్వాసితులు, జీవో నెం.3 అల్లూరి జిల్లా అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావాన్ని చూపబోతున్నాయి.

పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై దేశం అధినేత హామీ

కొన్ని ఆవాసాల నిర్వాసితులకు పునరావాస కాలనీలను కూడా పూర్తి చేయలేదు. ఈ అంశం ప్రధాన పార్టీల రెండింటి మధ్య నలుగుతున్న అంశం. ఈ అంశాన్నే వామపక్ష-కాంగ్రెస్ కూటమి కూడా అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది.



అనివేటి మండపానికి చేరిన నూతన ధ్వజస్తంభం

సత్యదేవుడి చెంతకు చేరిన

నూతన ధ్వజస్తంభం

18 నుంచి పూజలు, 22న ప్రతిష్ఠా కార్యక్రమం

అన్నవరం, ఏప్రిల్ 13: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి త్వరలో ప్రతిష్ఠించనున్న నూతన ధ్వజస్తంభం శనివారం ఇంజనీరింగ్ అధికారులు అనివేటి మండపంనకు ప్రత్యేక క్రేన్ ద్వారా తీసుకుని వచ్చారు. 56 అడుగులు ఉన్న నారవేప కర్రను ధ్వజస్తంభ ప్రతిష్ఠకు వినియోగిస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఈనెల 18 నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి 22న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నారు. అనంతరం ధ్వజస్తంభంకు రాగిరేకు అమర్చి బంగారుపూతను వేయనున్నారు. సుమారు రూ.4కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికయ్యే వ్యయమంతా నెల్లూరుకు చెందిన దాత కుటుంబసభ్యులు విరాళంగా అందజేస్తున్నారు. ఈ పనులను డీఈలు ఉదయ్‌కుమార్, బి.ఎస్.రాంబాబుల సూచనలతో సిబ్బంది వేగవంతం చేస్తున్నారు. 22వ తేదీన జాతీయ రహదారిపై నిర్మిస్తున్న నమూనాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించే పనులను అధికారులు శరవేగంగా చేపడుతున్నారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ చేతులమీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ట్రైన్‌లో ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి



తల్లీబిడ్డలను 108లో ఎక్కిస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, ఏప్రిల్ 13: గౌహతి ఎక్స్‌ప్రెస్ బెంగుళూరు నుంచి కృష్ణాగంజ్ వెళుతున్న రైలులో బెంగుళూరుకు చెందిన హీనా పురిటినొప్పులతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో రైలు తుని వద్దకు చేరుకోవడంతో ప్రయాణికుల సహాయంతో రైల్వే పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించగా తల్లీ బిడ్డలను 108లోఎక్కించి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



ఉప్పాడ తీరంలో లంగర్‌వేసి భద్రపరుచుకొన్న బోట్లు

రేపటి నుంచి జూన్ 14 వరకు

సముద్రంపై వేట నిషేధం

61 రోజుల పాటు మత్స్యకారుల ఉపాధికి విరామం

ఉప్పాడ(కొత్తపల్లి), ఏప్రిల్ 13: సముద్రంలో మత్స్యసంపద పునరుత్పత్తి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఈనెల 15 నుంచి జూన్ 14వరకు వేట నిషేధం అమలు చేస్తోంది. దీనిలో భాగంగా సుమారు 61రోజులపాటు తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేట చేసేందుకు వీలులేదు. కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన సుమారు 1400 బోట్లపై వేట చేసే మత్స్యకారులకు సుమారు 8,400 మంది మత్స్యకారులకు రెండునెలల పాటు జీవనోపాధికి ఆటంకం కలుగనుంది. ప్రతీ సంవత్సరం వేట నిషేధం అమలు చేయడం వలన పెద్దజాతి చేపలైన వంజరం, కోనాము, మాగ, మునివాలం, సంధువా, సుదుములు, సొర్ర, రొయ్య, నెత్తళ్లు వంటి చేపలు గుడ్లు పెట్టి పొదిగి మత్స్యసంపద అభివృద్ధి చెందు తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

వేట పరిహారం వెంటనే చెల్లించాలి

వేట నిషేధ కాలంలో ప్రభుత్వం మత్స్యకారులకు చెల్లించే పరిహారం వెంటనే చెల్లించాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సరైన పాటు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని మత్స్యకారులు వాపోతు న్నారు. వేట నిషేధ పరిహారం సకాలంలో చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన

శృంగార వల్లభస్వామి ఆలయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, ఏప్రిల్ 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,51,580 అన్నదాన విరాళాలు రూ.62,310 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.8,240 తులాభారం రూ.450 కానుకద్వారా 216 వెరసి రూ.3,27,796 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

19న అచ్చంపేటలో

సీఎం జగన్ బస్సు యాత్ర

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: కాకినాడరూరల్ మండలం అచ్చంపేట సెంటర్లో ఈనెల 19న సీఎం జగన్ నిర్వహించే మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతానికి సమిష్టిగా కృషి చేయాలని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి కోరారు. శనివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వైద్యనగర్‌లో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన 7 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, అసెంబ్లీ అభ్యర్థులు, ముఖ్య నాయకులతో బస్సుయాత్రపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో కాకినాడరూరల్ తిమ్మాపురం సెంటర్‌లో సిద్ధం సభ ద్వారా సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరిస్తారన్నారు. పార్టీ కేడర్ ఈ బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. వందశాతం ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎందన్నారు. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాల్లో పిఠాపురం ఒకటని, పవన్ కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారం, ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. సమావేశంలో ఎంపీ వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, ఎమ్మెల్యే అభ్యర్థులు దవులూరి దొరబాబు, వరుపుల సుబ్బారావు, తోట నరసింహరావు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి.అమ్మాజీ, సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బు బిళ్లపై అంబేడ్కర్ చిత్రం



గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని సబ్బు బిళ్లపై చెక్కారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. సోప్ కార్వింగ్ కళ ద్వారా మూడు గంటలపాటు శ్రమించి చెక్కిన అంబేడ్కర్ చిత్రాన్ని గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు తిలకించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించారు. గోవిందరాజులను విద్యాశాఖ ఆర్‌జేడీ గోవిందరాజులు, డీఈవో పి.రమేష్, డీవైఈవో డేనియల్‌రాజు, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం సురేష్‌కుమార్ అభినందించారు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన దొరబాబు

శంఖవరం, ఏప్రిల్ 13: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దొరబాబు టిప్పర్‌లారీ ఢీకొని మృతి చెందాడు. శంఖవరం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న దొరబాబు(35)ను కత్తిపూడి నుంచి రౌతులపూడి వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా తలకు, కాళ్ళకు బలమైన గాయాలు తగలడంతో మార్గంమధ్యలోనే దొరబాబు మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై అన్నవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే..

ఓటు దుర్వినియోగం కాకుండా నోటా

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే ఓటు దుర్వినియోగం కాకుండా నోటాకు ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. నోటా బటన్ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నట్టుగానే ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంటుంది. సాధారణంగా ఎన్నికల సమయంలోనే నోటా అనే పదం ఎక్కువగా వినిపిస్తుంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు నచ్చకపోతే చాలా మంది ఓటు వేయకుండా మిగిలిపోతున్నారు. అలాంటివారు సైతం ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తమ నిరసనను తెలియచేసేందుకు నోటా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రధానంగా పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించేందుకు నోటాను తీసుకువచ్చారు. బరిలో నిలబడ్డ కొందరు అభ్యర్థులకంటే నోటాకు పడ్డ ఓట్లు ఎక్కువగా ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంటి వద్ద నుంచే ఓటింగ్‌కు దరఖాస్తు..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఫారం-12డిని పూర్తిచేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. 85ఏళ్లు పైబడినవారు, 40 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హులుగా నిర్ధారించారు. ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరణ చేస్తారు. ఓటు ఎవరికి వేసారో తెలియకుండా గోప్యతను పాటించేలా రహస్య ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తారు. అవసరమైతే అభ్యర్థులు ఈ ప్రక్రియను పర్యవేక్షించుకోవచ్చు.

ఓటు నమోదుకు ఆఖరి అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. శాసన కర్తలను, నేతలను ఎన్నుకునేందుకు వయోజనులందరికీ రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం ఓటు. అర్హత ఉన్నా ఓటు హక్కు లేని వారికి, 18 ఏళ్ళు నిండినవారు కొత్తగా ఓటు వేసేందుకు చాలామంది ఆశక్తి చూపడంలేదు. పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం మరింత తక్కువ నమోదవుతుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటు హక్కును పొందడంతోపాటు ఎన్నికలలో ఓటు హక్కుపై ప్రజలకు వివరిస్తున్నారు. వినూత్న కార్యక్రమాలతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై తెలియజేస్తున్నారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా అధికారులు, యంత్రాంగం కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- రేపటితో ముగియనున్న గడువు
- ఓటు హక్కు నమోదు, వినియోగంపై విస్తృత ప్రచారం
- ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు
- పట్టణాలు, నగరాలు, యువతే టార్గెట్
- కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

సామర్లకోట, ఏప్రిల్ 13: కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు సమీపిస్తోంది. 18 ఏళ్లు నిండిన వారితో పాటూ అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వలన ఓటరుగా పేరు నమోదు చేసుకోని వారు ఇక ఆలస్యం ఎంతమాత్రం చేయకుండా తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటేసే అవకాశం లభిస్తుంది. ఈ మే నెల 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం విదితమే. అర్హత ఉన్న వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే పట్టణాలు, నగర ప్రాంతాలలో చదువుకున్నవారు అధికంగానే ఉన్నప్పటికీ ఓటరుగా పేరు నమోదు, ఓటుహక్కు వినియోగం విషయంలో ప్రజలు ఆశక్తిచూపడంలేదు. గ్రామీణులతో పోలిస్తే పట్టణాలు, నగరాలలో ఓటింగ్ ప్రక్రియల్లో పాల్గొంటున్న వారి సంఖ్య తక్కువే ఉంటోంది. ఇది ప్రతీ ఎన్నికలలోనూ నిరూపితం అవుతుంది. ఓటు విలువ తెలియక తమ పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా నగర, పట్టణాలు, తదితర శివారు ప్రాంతాలలో వలస కూలీలు, సంచార జీవులు లక్షలాది మంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. కొందరు తమకు అర్హత ఉన్నా ఓటరుగా పేరు కూడా నమోదు చేసుకోవడం లేదు. పట్టణ, నగర ప్రాంతాలు అభివృద్ధితో ముందుకు వెళుతున్నా ఎన్నికలలో ఓటు వేసే విషయంలో మాత్రం వెనుకబడే ఉంటున్నారు. ఎన్నికల రోజును చాలా మంది ఓ సెలవు దినంగానే చూస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కొన్ని పట్టణ ప్రాంతాలు సైతం ఓటింగ్ శాతం 60 శాతానికి మించకపోవడం గమనార్హం. వీటిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు రెండు నెలల ముందుగానే ఎన్నికల కమీషన్ అధికారులు కార్యాచరణ మొదలెట్టారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వో)తో పాటూ తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ జాబితాలను పరిశీలించి జాబితాలో తమపేరు ఉందో లేదో చూసుకోవాలి. మున్సిపాల్టీలలో మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఎన్నికల సంఘం ఓటరు సర్వీస్ పోర్టల్‌తో పాటు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి గడువు మాత్రం ఏప్రిల్ 15 అని మాత్రం అందరూ గుర్తించాలి.

ఓటు హక్కు పొందేందుకు వీరంతా అర్హులే

జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు అర్హులే. 2006 మార్చి 31లోగా పుట్టిన వారంతా ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయస్సు ధ్రువపత్రంతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో జతపరిచి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు, అన్ని అర్హతలున్నా ఇప్పటివరకూ ఓటరుగా నమోదు చేసుకోని వారంతా ఫారం-6 ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదుకు వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు అన్నీ ఓకే అయిన తరువాత కొన్ని రోజులలో ఇళ్ల వద్దకే ఓటరు గుర్తింపు కార్డును పంపిస్తారు. సంబంధిత ప్రాంత బూత్‌లెవెల్ అధికారులు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తారు. ఒకవేళ గుర్తింపు కార్డు రాకున్నా ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్రజలు దరఖాస్తులు చేసుకునే సమయంలో దరఖాస్తు రిజెక్ట్ కాకుండా నిర్ణీత ప్రొఫార్మాలో ఆధార పత్రాలతో జతపర్చి దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా జెరాక్స్ పత్రాలను జతచేయాలి. ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టు సైజ్ ఫోటోను ప్రొఫార్మాలో అడిగిన ఇతర వివరాలను సమర్పిస్తే దరఖాస్తు రిజెక్ట్ కాకుండా ఓటరుగా నమోదవుతారు.

యువతే లక్ష్యంగా వివిధ అవగాహన కార్యక్రమాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశంలోని ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల కమీషన్ స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో స్వీప్ కార్యక్రమ నిర్వహణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించారు. ముఖ్యంగా ఓటింగ్ శాతం తక్కువ నమో దయ్యే పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాలలో వినూత్న రీతిలో ఓటర్ల చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను చైతన్యపరిచేందుకు కళాశాలల్లో కూడా వినూత్న అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు ఓటు నమోదుతోపాటూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన ఏర్పరుస్తున్నారు. ప్రతీ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించారు. వీరు మిగతా విద్యార్థులకు ఓటరుగా నమోదుకావడానికి తోడ్పడుతున్నారు. ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులను చైతన్యపరిచే పిల్లలతో కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేను ఓటేస్తా, 5కె రన్, 2కె రన్, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్‌లు, ట్రాన్స్‌జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్, సైకిలిస్ట్ అసోసియేషన్లు, పోలీసులు, విద్యార్థులను ఈ కార్యక్రమాలలో భాగస్వాములుగా చేస్తున్నారు. రెండు రోజులుగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఎంకే మీనా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ (నేను తప్పకుండా ఓటు వేస్తాను) వంటి నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు.

25న అనుబంధ జాబితా

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను గత ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో మరోసారి జాబితా సవరణ చేపట్టారు. దీని ప్రకారం ఈనెల 15 తేదీ వరకూ ఓటరు నమోదు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారి పేర్లను అనుబంధ జాబితాలో చేరుస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయాలన్నా, అభ్యర్థులుగా పోటీ చేయాలన్నా ఓటరు జాబితాలో పేరుంటేనే సాధ్యం అవుతుంది. ఓటు హక్కు అర్హత ఉండి జాబితాలో పేరులేని వారందరూ దరఖాస్తు చేసుకోవాలి. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, చదువుకున్న వారు ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలపై తెలియని వారికి తెలియజెప్పాలి. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని, పేరు లేకుంటే దరఖాస్తు కోసం ప్రోత్సహించాలి.

తూర్పుగోదావరి

ఏజెన్సీ సమాచారం

పీవో, ఏపీవోలకు ఈవీఎంలపై శిక్షణ

● సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 13: త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ 399 పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల మండలాలకు సంబంధించిన 250 మంది పీవోలు, ఏపీవోలకు శిక్షణనిచ్చినట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే రోజున ఉదయం 5.30కు మాక్ పోల్ నిర్వహించాలని, అందుకు ఎన్నికల సిబ్బంది పక్కాగా శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, ఏవీ రమణ, డీవీ సత్యనారాయణ, డీటీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, బాలాజీ, శివ, శ్రీధర్, విశ్వనాధం, స్వామి, జి.సత్యనారాయణ, వీరభద్రరావు, సరిత, మూర్తి, ఆర్ఐ ఎస్.విఘ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో బీజేపీ, వైసీపీ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రైతు సంఘం నాయకుడు మురళి

కూనవరం, ఏప్రిల్ 13: రైతులను ఆదుకోవడంలో బీజేపీ, వైసీపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు ఎ.మురళి అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను ఓటు అడిగే హక్కు అటు బీజేపీ, ఇటు వైసీపీకి లేదన్నారు. ముంపు రైతులకు పరిహారం ఇచ్చిన భూములకు అదనంగా రూ.5లక్షలు ఇస్తామని జగన్ గొప్పలు చెప్పుకున్నారని అయినా ఇంతవరకు వాటి ఊసే లేదన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా రైతులు ధర్నాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ప్రెసిడెంట్ కొమరం పెంటయ్య, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు కబ్బారావు మృతి



గురువు మీనా కబ్బారావు మృతదేహం వద్ద ఏడుస్తున్న విద్యార్థులు(ఇన్‌సెట్‌లో కబ్బారావు)

మోతుగూడెం, ఏప్రిల్ 13: చింతూరు మండలం మోతుగూడెం సుకుమామిడిలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న మీనా కబ్బారావు ఆకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో విద్యార్థులు సుకుమామిడి గ్రామం నుంచి మోతుగూడెం వరకు నడుచుకుంటూ వచ్చి ఉపాధ్యాయుడు మృతదేహంవద్ద విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. పూర్వవిద్యార్థులు, గ్రామస్థులు, తోటి ఉపాధ్యాయులు ఆయన మృతదేహంవద్ద సంతాపం తెలిపారు. కబ్బారావు మాస్టారు అనేకసార్లు ఉత్తమ ఉ పాధ్యాయ అవార్డు తీసుకున్నారు. చింతూరు ఎంఈవో వెంకటేశ్వరరావు, ఏపీ జెన్కో ప్లాంట్ మేనేజర్ బి.బాలకృష్ణ, సర్పంచ్ ఆకేటి సీత, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, వార్డుమెంబర్, జర్నలిస్టులు భౌతిక కాయంవద్ద నివాళులర్పించి సంతాపం తెలిపారు.

మల్లవరంలో అగ్నిప్రమాదం

గోకవరం, ఏప్రిల్ 13: మండలంలోని మల్లవరంలో శనివారం అగ్ని ప్రమా దం జరిగింది. ఈ ప్రమాదంలో గుర్రం నిర్మలకు చెందిన తాటాకిల్లులో నిర్వ హిస్తున్న హోటల్, బొదిరెడ్డి అన్నాయబ్బుకు చెందిన మూడెకరాలన్నర పొలంలోని గడ్డివాము కాలి బూడిదయ్యాయి. హోటల్ సామగ్రితో పాటు, మంచం బీరువాలు తదితర గృహ సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్ర మాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. బాధితులను అన్నివిధా లా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్థులు కోరుతున్నారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ పరామర్శించారు.

శీని ప్రసాద్ ప్రథమ వర్ధంతి

కొవ్వూరు, ఏప్రిల్ 13 : మండలంలోని వేములూరులో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ శీని ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మరపట్ల కళాధర్ చక్రవర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అక్కిన రాంబాబు, శీని సుదర్శనం, ముళ్ళపూడి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మి, తుమ్మిడి రామలక్ష్మి, బంటోతు సురేష్, బిక్కిన శ్రీను పాల్గొన్నారు.

పైడిమెట్టలో చలివేంద్రం

తాళ్లపూడి, ఏప్రిల్ 13: మండలంలోని పైడిమెట్ట గ్రామంలో నందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని తహశీల్దార్ శ్రీనివాసరావు ప్రారంభించారు. రానున్న రెండు నెలలు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, కుండల్లో ఉంచిన చల్లటి నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల, ఫౌండేషన్ ప్రతినిధులు దేవరపల్లి రవి, చంద్రశేఖర్, ఆలీ, జస్వంత్, విజయ్, పాల్గొన్నారు.

సర్వే తోటలో అగ్ని ప్రమాదం

తాళ్లపూడి, ఏప్రిల్ 13: మండలంలోని గజ్జరం గ్రామంలో శనివారం సర్వేతోటలో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామంలోని రైతు కేసిరాజు రవిచంద్రకు మార్‌కు చెందిన 10 ఎకరాల భూమిలో సర్వేతోట ఉంది. శనివారం మధ్యాహ్నం తోట దగ్ధమైందని, సుమారు ఐదెకరాల్లో తోట కాలిపోయిందని, రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రూ. 59,500 నగదు సీజ్

కొవ్వూరు, ఏప్రిల్ 13: ఎన్నికల కమిషన్ నిబంధనలను విరుద్ధంగా తరలిస్తున్న రూ.59,500 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. నిడదవోలు నుంచి కొవ్వూరు కారులో సరైన పత్రాలు చూపకుండా వ్యాపారి తరలిస్తున్న రూ.59,500 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీము స్వాధీనం చేసుకున్నారన్నారు.

వ్యవస్థలను అడ్డుపెట్టుకుని నిరంకుశ పాలన

దేవరపల్లి, ఏప్రిల్ 13: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని నిరంకుశంగా పాలన కొనసాగిస్తుదని రాజమహేంద్రవరం లోక్‌సభ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. దేవరపల్లిలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్లు, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు అవినీతి, అక్రమ పాలన చేశాయన్నారు. సీఎం జగన్ అనేక చీకటి జీవోలు తెచ్చి అరాచకంగా పాలించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 13 లక్షల ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గోపాలపురం అభ్యర్థి మార్టిన్‌లూథర్, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణ, నాయకులు వెలగా రామకృష్ణ, కాకర్ల శ్రీహరిబాబు, జ్యేష్ఠ సతీష్‌బాబు, శారదాదేవి, ఆకుల సౌభాగ్యలక్ష్మి, సీపీఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, కే.రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణ సభ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో ఈ నెల 15వ తేదీన లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన రెండు పార్టీల ఉమ్మడి సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు హాజరవుతారని తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : గోరంట్ల



కూటమి అభ్యర్థి గోరంట్లను సత్కరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

కడియం, ఏప్రిల్ 13: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని మురమండలో జరిగిన కూటమి ఆత్మీయ సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలంటే విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబుతోను సాధ్యమన్నారు. కూటమి అధికారమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు దళితులు టీడీపీలో చేరారు. వారికి గోరంట్ల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఆయనను టీడీపీ, జనసేన శ్రేణులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, వట్టికూటి జానకీరామ్, దేవళ్ళ రామ్మోహనరావు, గారపాటి సురేంద్ర, గద్దే శ్రీధర్, గద్దే చిన్నా, పోతుల వీర్రాజు, నల్లూరి రామకృష్ణ, నందమూరి సూరిబాబు, గారపాటి శ్రీను, మరిడి సత్యనారాయణ భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ, జనసేన మండలాధ్య క్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: రాజవోలులో నిమ్మలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో గోరంట్ల బుచ్చియ్యచౌదరి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే పాలన మారాలన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కూటమి విజయానికి కృషి చేయాలి: నల్లమిల్లి

అనపర్తి/బిక్కవోలు, ఏప్రిల్ 13: కూటమి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనపర్తి టికెట్‌పై సందిగ్ధతకు దాదాపుగా తెరపడిందని, 30 రోజులు మాత్రమే గడువు ఉన్నందున పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. కాగా అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా బరిలో నిలువనున్న రామకృష్ణారెడ్డి మండలంలోని తొస్సిపూడిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి పోటీ చేస్తుండడంతో స్థానిక గణపతి ఆలయంలో రెండు పార్టీల తరపున ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకుడు టి.సత్యనారాయణ, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం'

గోకవరం, ఏప్రిల్ 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దాడులు మరింత పెరిగాయని పలువురు దళిత నాయకులు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, రంపయర్రంపాలెం, గంగంపాలెం గ్రామాల్లో శనివారం దళితగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దళిత నాయకులు ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే దళితులకు తగిన న్యాయం, రక్షణ లభిస్తాయన్నారు. రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూను, కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌ను గెలిపించాలని వారు అభ్యర్థించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మంగరౌతు రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గునుపే భరత్, బాదంపూడి ప్రకాష్, హర్షిత, మోర్త చిట్టిబాబు, ఈది అశోక్, కొంగరపు రాజు, గున్నూరి లాజరు, సాంబత్తుల చంద్రశేఖర్, గుడాల రాంబాబు, పాల్గొన్నారు.

భరత్‌రామ్ తీరుతో వైసీపీకీ రాజీనామా

» కూటమి అభ్యర్థి ఆదిరెడ్డికే మా మద్దతు
» జిల్లా మాజీ కార్యదర్శి గుడె రఘునరేష్



సమావేశంలో మాట్లాడుతున్న రఘునరేష్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరం వైసీపీలో ఎంపీ భరత్‌రామ్ తీరుతో విసుగు చెందే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ జిల్లా మాజీ కార్యదర్శి గుడె రఘునరేష్ ప్రకటించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసీపీలో సీనియర్లకు గౌరవం లేదన్నారు. 2019 ఎన్నికల్లో భరత్‌రామ్ విజయానికి ఎంతగానో కృషి చేశామని, అతను గెలిచాక తామెవరో తెలియనట్టుగా ఉన్నారని విమర్శించారు. నగరంలో వైసీపీ కోఆర్డినేటర్లను వరుసగా మార్పించి పార్టీ బలహీనపడేలా చేశాడన్నారు. గతంలో తామంతా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో పాటు వైసీపీలో చేరామన్నారు. ఆటుపై షర్మిళారెడ్డి తమను గుర్తించారన్నారు. కానీ భరత్‌రామ్ మాత్రం తమను పట్టించుకోలేదన్నారు. ఆరు నెలలుగా పార్టీలో ఉన్న నేతలు సమస్య చెప్పినా భరత్ తీరు మారలేదన్నారు. అతనితో కలిసి పయనించలేక వైసీపీకి రాజీనామా చేసినట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ముత్యాల పెదబాబు, ముమ్మిడి వీరబాబు, గొలుగూరి సూర్రెడ్డి, ఇంటి దొరబాబు, ర్యాలి రామకృష్ణ, మహిళా విభాగం నాయకురాలు గోపిశెట్టి విజయలక్ష్మి, కుప్పిలి శంకరరెడ్డి, పినిశెట్టి మూర్తి, రెడ్డి రమణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపండి : వాసు



5వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం 5వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: ప్రజలందరు సుఖంగా సంతోషంగా జీవనం సాగించాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 5వ డివిజన్‌లో శనివారం ఆదిరెడ్డి వాసు, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు హితేష్ చెంచురామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌లతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు, లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాసు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ప్రజలకు సుస్థిరమైన పాలన అందించాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు సీఎం కావాలన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి టీడీపీ వేసి న పునాదుల మీదనే వైసీపీ సుందరీకరణ చేసిందన్నారు. ఆ సుందరీకరణ పనులు కూడా చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. క్రీడాకారులు ఆడుకోవడానికి వీలు లేకుండా మైదానాల్లో నిర్మాణాలు చేపట్టడం మంచిదికాదన్నారు. నగరంలో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది ప్రజలు మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. ఆయా సమస్యలు దృష్టిలో పెట్టుకునే తాము అందరికీ మెచ్చే మేనిఫెస్టోను రూ పొందించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య రాజమండ్రి కోసం కృషి చేస్తామన్నారు. క్రీడాకారుల కోసం మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని చెప్పారు. మహిళల రక్షణకు ప్రత్యేక దళాలు ఏర్పాటు చేస్తామన్నారు. యువత ఉపాధికి స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేస్తామన్నారు.ఇవన్నీ జరగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో కూట మి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, నాయకులు సిరిగినేటి విద్యాసాగర్, ధర్మ, ఆనంద్, తాడేపల్లి ఫణీంద్ర, సాయి దీపక్, ప్రశాంత్ బాబు, టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ డిక్లరేషన్

రాజమహేంద్రవరంలో క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా శిక్షణ ఇప్పించేందుకు స్పోర్ట్స్ డిక్లరేషన్ ప్రకటిస్తున్నానని టీడీపీ-జనసేన-బీజేపీ సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేసారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో స్పోర్ట్స్ డిక్లరేషన్ ప్రకటించారు. రాజమండ్రికి చెందిన క్రీడాకారుల కోసం వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. క్రీడలకు ప్రాధాన్యమివ్వకుండా జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. క్రీడలకు క్యాపిటల్ సంగతి ఎలా ఉన్నా వైసీపీ నేతలు మాత్రం డ్రగ్స్‌కు క్యాపిటల్‌గా మార్చేశారని మండిపడ్డారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో పెద్ద కామిక్ షో చేశారని టెన్నిస్‌బాల్‌ని బ్యాట్‌తో కొడితే బ్యాట్ విరిగిపోయిందన్నారు. ఆడుదాం ఆంధ్రాలో కూడా 25శాతం కమిషన్ వదలలేదన్నారు. టీడీపీ హయాంలో వీఎల్ పురం వద్ద రూ.11 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ మంజూరు చేస్తే అటుపై అధికారంలోకి వచ్చిన వైసీపీ గాలికి వదిలేసిందన్నారు. ఏకేసీ కాలేజీ సమీపంలో రూ.5 కోట్లతో తలపెట్టిన ఒలింపియాడ్ స్విమ్మింగ్ ఇండోర్ పూల్ ఏమైందని ప్రశ్నించారు. వైసీపీది పే అండ్ ప్లే విధానమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఒలింపియాడ్ స్విమ్మింగ్ ఇండోర్ పూల్‌ను నిర్మిస్తామన్నారు. భవిష్యత్తు తరాల బాగు కోసం నగరంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికే తాము హెల్త్ డిక్లరేషన్, టూరిజం డిక్లరేషన్ ప్రకటించామని నగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపించాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నానని వాసు చెప్పారు. అనంతరం స్పోర్ట్స్ డిక్లరేషన్ పత్రాన్ని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడాకారులకు అందించారు.సమావేశంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు సుంకర వెంకటరమణ, గంగాధరం, రన్నింగ్ ట్రాక్ ఇన్‌చార్జి శాంసంగ్ ప్రసాద్, క్రీడాకారులు అమీర్ రాజా, మహేష్‌యాదవ్, కృష్ణంరాజు, ముత్యాల శివ, విజయ మనోజ్, వినయ్, మహేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ డిక్లరేషన్ పత్రాన్ని అందిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13: సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠోత్సవం 3వ వార్డు సుబ్బారావుపేటలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, అఖండ దీపస్థాపన ఎంపీ మా ర్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తారన్నారు. సోమవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. పిడింగొయ్యి గ్రామంలోని శ్రీకోదండరా మాలయం వద్ద శనివారం ఉదయం పందిరిరాట మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. 17న సీతారామ కల్యాణం జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో నక్కా నగేష్, బళ్ళా శ్రీనివాసరావు, పల్లా వెంకటేశ్వరరావు, కేబుల్ శ్రీనివాస్, తెల్లమేకల సత్యనారాయణ దంపతులు, కమిటీ సభ్యులు సూరారావురెడ్డి, వై.దుర్గ, కాదా సత్యనారాయణరావు,టి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కొవ్వూరు, ఏప్రిల్ 13: బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా హోంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కొవ్వూరు సత్యవతినగర్‌లోని శాంతివెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్ థెరిస్సా హోంలో యునైటెడ్ స్ట్రెంగ్త్ (మాల) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరాన్ని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నాయకులు సందర్శించారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు పోలింగ్ సామగ్రి

» బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ భద్రం
» అనపర్తిలో 228, రాజానగరంలో 216 పోలింగ్ కేంద్రాలు



అనపర్తి జడ్పీ హైస్కూల్లో ఈవీఎంలను భద్రపరచి సీల్ వేస్తున్న ఆర్వో

అనపర్తి, ఏప్రిల్ 13: వచ్చే నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు వినియోగించే ఈవీఎమ్‌లు శనివారం అనపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నాయి. వీటిని రాజకీయ నాయకుల సమక్షంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీలు వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఆర్వో మాధురి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిజర్వ్ యూనిట్స్‌తో కలిపి పార్లమెంట్ అసెంబ్లీ యూనిట్స్ 273, కంట్రోల్ యూనిట్స్ 273 బ్యాలెట్ యూనిట్స్, 296 వీవీ ప్యాట్స్ చొప్పున అనపర్తికి చేరుకున్నాయని, వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీలు వేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శివగణేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ పార్టీలకు చెందిన నాయకులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: రాజానగరం అసెంబ్లీ సిగ్మెంట్, పార్లమెంట్‌కు సంబంధించి అన్ని బాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ పాట్స్ విజయవంతంగా స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచి సీలు వేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోలీసు భద్రత మధ్య రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎమ్‌లను నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీలు వేశామన్నారు. నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రిజర్వ్ యూనిట్లతో కలిపి 259 బ్యాలెట్ యూనిట్‌లు, 259 కంట్రోల్ యూనిట్‌లు, 280 వీవీ ప్యాట్స్ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచామని పేర్కొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ దాడి

రంగంపేట, ఏప్రిల్ 13: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లో సారా తయారీ, మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు శనివారం తెలిపారు. మండలంలోని అచ్యుతాపురంలో సారా తయారు చేస్తున్న కురుకూరి శ్రీను, అంచూరి రామాంజనేయులును అరెస్టు చేసి వారి నుంచి 145 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే ఈలకొలనులో సారా తయారీ చేస్తున్న గుత్తుల సూరిబాబును అరెస్టు చేసి, 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి 'అవంతి' దాతృత్వం

రూ.10 లక్షలతో ఆధునీకరణ పనులు

కొవ్వూరు, ఏప్రిల్ 13: కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో సుమారు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు అవంతీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతలో భాగంగా రూ.10 లక్షలతో ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, మెటర్నిటీ వార్డు, నవజాత శిశువు గది పునరుద్ధరణ పనులతో పాటు వాటికి ఎయిర్ కండీషనింగ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, అవంతీ ఫీడ్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నివ్య విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం నివ్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ పి ఎర్నెస్ట్ మోజెస్ తెలిపారు. సీనియర్ ఒకేషనల్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పి.రిత్విక్ 954 మార్కులు, ఎంపీహెచ్ డబ్ల్యూ నర్సింగ్‌లో జి.మేరి ప్రేమలత 940 మార్కులు, ఎస్.కుసుమ 926 మార్కులు, ఎంఎల్‌టీలో జె.రమ్య 918 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఒకేషనల్ విభాగం ఎంఎల్‌టీలో పి.నవ్యశ్రీ 478 మార్కులు, డి.విజయ్‌కుమార్ 477 మార్కులు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో సీహెచ్ నాగపద్మావతి 476 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థు లను కరస్పాండెంట్ గారపాటి ఎలిజబెత్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయదుందుభి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరం శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. ఫస్టియర్ ఎంపీసీలో విద్యార్థి పి.లక్ష్మణుడు 466/470 మార్కులు, బైపీసీలో ఎం.ప్రజ్ఞాత కళ్యాణ్ 435/440 మార్కులతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచారు. సెకండియర్ ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థిని ఆర్.లక్ష్మిసాయి 988/1000 మార్కులు, బైపీసీ విద్యార్థిని బి.సత్యహాసిని 982/1000 మార్కులు సాధించారు.ఈ మేరకు ఏజీఎం ఎం హరిప్రసాద్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

33 మంది వలంటీర్ల రాజీనామా

బిక్కవోలు ఏప్రిల్ 13: బిక్కవోలు మండలం కొమరిపాలెంలో శనివారం 33మంది వలంటీర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. వీరంతా తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. పింఛన్లను తమతో పంపిణీ చేయించకుండా అడ్డుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలిపారు.

త్యాగధనుల ఉద్యమ కృషి స్ఫూర్తిదాయకం

కడియం, ఏప్రిల్ 13: సంక్షేమ, విజ్ఞాన, సమ సమాజం కోసం జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్, కోశాధికారి ఈ వీవీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. శనివారం వేమగిరిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమం కోసం కృషి చేసి న చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, ఏవీ సూర్యనారాయణ రాజుతో పాటు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.అబ్బాయి, వేదుల శాస్త్రి, ఎస్.అనిత, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



రంగంపేటలో పూజలు చేస్తున్న మల్లేష్ దంపతులు

రంగంపేట, ఏప్రిల్ 13: రంగంపేటలో మంచినీటి చెరువు వద్ద గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం జరిపారు. నక్క మల్లేష్‌దుర్గాదేవి దంపతులతో పురోహితులు ప్రత్యేక పూజలు చేయించి కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్ధాంతపు సత్తిబాబు, దార్ల అమ్మిరాజు, గరగడాల నాగేంద్రబాబు, దవరసింగ్ వెంకటరమణ, కోత్తుర్తి సత్తిబాబు, ర్యాలి బాబి, అవుపాటి శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

బీసీల సంక్షేమం విస్మరించిన జగన్

బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13 : బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత బీసీల సంక్షేమం, వారి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. మళ్లీ అధికారం కోసం బీసీ జపం చేస్తూ అబద్ధాలు చెబుతున్న జగన్ పట్ల బీసీ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఓబీసీ సమాజం అభివృద్ధికి ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారని, బీసీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడానికి, రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో ఎన్‌డీఏ అభ్యర్థిగా తన గెలుపునకు బీసీలంతా ఏకం కావాలన్నారు. అన్ని కుల సంఘాలను కలుపుకుని అత్యధిక మెజార్టీతో గెలిచేలా ఓబీసీ మోర్చా నాయకులు బూత్‌స్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, నాయకులు కురగంటి సతీష్, హారిక, యెనుముల రంగారావు, ఓబీసీ మోర్చా జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



పోలింగ్ సామగ్రి తరలింపును పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారిణి మాధవీలత

పోలింగ్ సామగ్రి తరలింపు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13 : జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లో జిల్లా సెంట్రలైజ్డ్ ఈవీఎం గొడౌన్‌లో భద్రపరిచిన ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం, అనుబంధ యూనిట్స్ శనివారం ఆయా నియోజకవర్గాల తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్టు చెప్పారు.అనపర్తి నియోజకవర్గంలో రామారెడ్డి జడ్పీ హైస్కూల్‌కు 273 బ్యాలెట్ యూనిట్స్, 273 కంట్రోల్ యూనిట్స్, 296 వీవీ ప్యాడ్‌లు పంపించారు. రాజానగరం నియోజకవర్గానికి నన్నయ యూనివర్సిటి వెలుగుబందలో 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 259 బ్యాలెట్, 259 కంట్రోల్ యూనిట్స్, 280 వీవీ ప్యాట్స్ తరలించారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు నగరంలో 232 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 285 బ్యాలెట్ యూనిట్స్, 285 కంట్రోల్ యూనిట్స్, 310 వీవీ ప్యాట్స్ పంపించారు. రాజమహేంద్రవరం రూరల్‌కు ధవళేశ్వరం నెక్ హాస్టల్ భవనానికి 264 పోలింగ్ కేంద్రాలకు 324 బ్యాలెట్, 324 కంట్రోల్ యూనిట్స్, 348 వీవీ ప్యాట్స్ పంపించారు. కొవ్వూరుకు మావులేటి సోమరాజు సంస్కృత ఉన్నత పాఠశాల 176 పోలింగ్ కేంద్రాలకు 211 బ్యాలెట్, 211 కంట్రోల్ యూనిట్స్, 228 వీవీ ప్యాట్‌లు పంపించారు. నిడదవోలు జూనియర్ కళాశాలకు 205 పోలింగ్ కేంద్రాలకు 246 బ్యాలెట్, 246 కంట్రోల్ యూనిట్స్, 266 వీవీ ప్యాట్స్‌ను పంపించారు. గోపాలపురం నియోజకవర్గానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు 248 పోలింగ్ కేంద్రాలకు 297 బ్యాలెట్, 297 కంట్రోల్ యూనిట్స్, 322 వీవీ ప్యాట్‌లను పంపించారు. ఆయా స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీల్ వేశారు.ర్యాండమైజేషన్ అనంతరం వాహనాల తరలింపులో ఏడు నియోజకవర్గాల ఆర్వోలు తేజ్ భరత్ ,దినేష్ కుమార్, అశు తోష్ శ్రీవాత్సవ్,డీఆర్వో జి.నరసింహులు, ఏ.చైత్రవర్షిణి, కెఎల్ శివజ్యోతి, మాధు రి, ఆర్‌వి రమణా నాయక్, పార్లమెంట్ ఆర్వో, సహాయ ఆర్వోలు కృష్ణానాయక్ , ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు చిత్రంలో పక్కపక్కనే మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు

గోపాలపురాన కుదిరిన సయోధ్య


- మద్దిపాటితో కలిసిన ముళ్ళపూడి వర్గం
- చంద్రబాబు ఆదేశాలతో సర్దుబాటు చేసిన గన్ని
- అనపర్తి నియోజకవర్గం టీడీపీకే?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని టికెట్ల విషయంలోనూ టీడీపీలో అక్కడక్కడా వినిపించిన అసంతృప్తులు సద్దుమణిగాయి. గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, మాజీ జడ్పీ చైర్మన్, టీడీపీ సీనియర్‌నేత ముళ్లపూడి బాపిరాజు మధ్య సయోధ్య కుదిరింది.దీంతో ఇక్కడ నియోజకవర్గంలోని శ్రేణులంతా ఒకటయ్యారు. ఇక్కడ అభ్యర్థి వెంకట్రాజుకు మరింత బలం చేకూరినట్టు అయింది. ఈ మేరకు శనివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. వెంకట్రాజు..బాపిరాజు ఒకే వేదికపై ఆశీనులవ్వగా టీడీపీ నాయకుడు గన్ని వీరాంజనేయులు సయోధ్య కుదిర్చారు. అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు అంతా కలిసి పనిచేయాలని సూచించారు. అంతా ఒక్కటై జై చంద్రబాబు.. జై మద్దిపాటి అంటూ నినాదాలు చేశారు. ఇక అనపర్తి సీటు తిరిగి టీడీపీకే దక్కనుంది. రేపోమాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. మిగతా చోట్ల అంతా బాగానే ఉన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని కూటమి అభ్యర్థులంతా విజయం వైపు దూసుకుపోతున్నట్టు వివిధ సర్వేలు చెబుతున్నాయి. చిన్న చిన్న సమస్యలను ప్రక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంతో అందరూ ఏకమవుతుండడం కూటమికి శుభ పరిణామంగా ప్రజలు భావిస్తున్నారు.



సమయం లేదు.. మిత్రమా!



ఎన్నికలకు మిగిలింది 30 రోజులే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సమయంలేదు మిత్రమా.. రణమా..శరణమా.. సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి.. పోలింగ్‌కు ఇక మిగిలింది నెలరోజులే..ఈ నెల రోజులు ఓటర్ సమయమే.. ఓటరు ఏదనుకుంటే అది చేయవచ్చు.ఎవరిని గెలిపించుకోవాలంటే వారిని గెలిపించుకోవచ్చు..ప్రభుత్వంపై వ్యతి రేకత కారణంగా ఇప్పటికే ఓటరు సన్నద్ధమైపోయాడు. ఈ సారి ఎన్నిక లాంఛనమే అనేది మేధావుల వాదన.. జిల్లాలోని లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికార్లను నియమించారు.ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబం ధించిన అన్ని ఏర్పాట్లను చకచకా చేస్తున్నారు.ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టకుండా చూడడానికి నిఘా పెంచారు. సరిహద్దులు, ముఖ్య కూడళ్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదికవి నన్నయ వర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు.. పోలింగ్‌కు 1569 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను కూడా గుర్తించారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ..

మే 13న పోలింగ్ జరగనుంది.నామినేషన్ల ప్రక్రియకు ఈనెల 18న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. గత నెల 16న ఎన్నికల షెడ్యూల్ రావడం, కోడ్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. 18 నుంచి 25వ తేదీ వర కూ నామినేషన్లు స్వీకరిస్తారు. 26న పరిశీలిస్తారు. 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు.అదే రోజు తుది జాబితా ప్రకటిస్తారు.ఆ రోజు బరిలో ఎవరున్నారో స్పష్టమవుతుంది. మే 13న జిల్లాలో పోలింగ్. జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు. ఆదికవి నన్నయ వర్సిటీలో రెసెప్షన్ కేంద్రం, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీ స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు తదితర ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో దాఖలు చేయాలి. రాజమహేంద్రవరం అర్బన్ అభ్యర్థులు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీసు, రూరల్ అభ్యర్థులు కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో, అనపర్తి అభ్యర్థులు అనపర్తి ఎంపీడీవో ఆఫీసు, రాజానగరం అభ్యర్థులు రాజానగరం ఎంపీడీవో ఆఫీసులోనూ, కొవ్వూరు అభ్యర్థులు కొవ్వూరు సబ్-కలెక్టర్ కార్యాలయం, నిడదవోలు అభ్యర్థులు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రామకచేరి కార్యాలయంలో, గోపాలపురం అభ్యర్థులు తహశీల్దార్ కార్యాలయంలో దాఖలు చేయాలి.

- మే 13న పోలింగ్
- ఈ నెల 18 నుంచి నామినేషన్లు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- జోరుగా అభ్యర్థుల ప్రచారం..
- చకచకా సాగుతున్న ఏర్పాట్లు
- తుది జాబితాలో పెరిగిన ఓటర్లు
- జిల్లాలో ఓటర్లు 16.16 లక్షలు
- పురుషులు 7,89,443
- మహిళలు 8,27,380
- రేపటి వరకూ ఓటు నమోదు

ఓటర్లు 16,16,918

జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉండగా ఆ సంఖ్య కొద్దిగా పెరి గింది. ఇప్పటి వరకూ 11,156 మంది ఓటర్లు పెరిగారు.దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య 16,16,918 అయింది. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకూ ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ పురుషులు 7,89,443 మంది, మహిళలు 8,27,380 మంది, థర్డ్ జండర్ 95. గతంలో వీరి సంఖ్య 105 ఉండేది. ఎందుకో పది మంది తగ్గారు.జిల్లాలో పురుషుల కంటే 37,937 మంది మహిళా ఓటర్లు ఎక్కువ. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం రాజమహేంద్రవరం రూరల్.. 2,72,440 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,39,364, పురుషులు 1,33052. థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు..మొత్తం ఓటర్లు 1,83,603 మంది, పురుషులు 89,496 మంది, మహిళలు 94,102 మంది, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ రెండో స్థానంలో ఉంది.2,65,479 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,37,656, పురుషులు 1,27,773 మంది, థర్డ్ జండర్లు 50 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానంలో ఉంది.. 2,41,840 మంది ఉండగా, పురుషులు 1,18,552 మంది, మహిళలు 1,23,283 మంది, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. అనపర్తి నాలుగో స్థానంలో ఉంది. 2,25,188 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,10,125, మహిళలు 1,15,060, థర్డ్ జండర్ ముగ్గురు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. 2,15,584 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,06,473, మహిళలు 1,09,107 మంది, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,12,784 పురుషులు 1,03,972, మహి ళలు 1,08,808, ట్రాన్స్‌జెండర్స్ నలుగురు ఉన్నారు. కొవ్వూరు అతి తక్కువ ఓట ర్లతో చివరి స్థానంలో ఉంది..

336 సమస్యాత్మక కేంద్రాలు..

రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలు ఉండగా అతిసమస్యాత్మక 10, 50 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలకు 67 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం సిటీలో 232 కేంద్రాలకు 13 అతిసమస్యాత్మక, 36 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. రూరల్‌లో 264 కేంద్రాలకు అతిసమస్యాత్మక 7, సమ స్యాత్మక కేంద్రాలు 15 ఉన్నాయి. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలకు 35 సమస్యాత్మక, నిడదవోలులో 205 కేంద్రాలకు 41 సమస్యాత్మక, గోపాలపురంలో 248 కేంద్రాలకు 62 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి.మొత్తం జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు ఉండగా అతిసమస్యాత్మక 30 కేం ద్రాలు 306 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్య తలు అప్పగించారు.ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569 మంది, ఇతర పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని నియమించారు.



సైకిల్ జోరు.. ఫ్యాన్ బేజారు..

టీడీపీ-జనసేన,బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. అభ్యర్థులు అందరూ గట్టివారే. లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్‌టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి బరిలో దిగారు. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు,రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చ య్య చౌదరి, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్ ప్రచారంలో దూసుకుపోతు న్నారు. ఇక అనపర్తి సీటు తిరిగి టీడీపీకే దక్కనుంది. ఈ మేరకు రేపో మాపో అధికారిక ప్రకటన రానుంది. దీంతో అక్కడి టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం తిరిగి ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు ప్రచారం వేగవంతం చేశారు. వైసీపీలో ఇంత వరకూ పెద్దనేతల ఎవరూ ప్రచారానికి రాలేదు.కూటమికి ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి ఓ ఊపునిచ్చిన సంగతి తెలి సిందే. టీడీపీలో అసంతృప్తులన్నీ సద్దుమణగగా,వైసీ పీలో మాత్రం ఎవరి దారి వారిదే అన్నట్టు ఉంది. ఒకరినొకరు వెన్నుపోట్లు పొడుచుకుంటున్నారు. ఈ నెల 16న వైసీపీ అధినేత, సీఎం జగన్ సిద్ధం సభ జిల్లాలో ఉండవచ్చని చెబుతున్నారు. కానీ జనసమీకరణ ఎలా అనే సమస్యతో నేతలు తలపట్టుకున్నారు.

రాజీ డ్రామాలు!

వలంటీర్ల జీవితంతో వైసీపీ ఆటలు

- అధికార పార్టీ నాయకుల బెదిరింపుల ఉచ్చు
- రాజీనామా చేయాలంటూ హుకుం
- ఆగని అరాచకీయం..మరోవైపు ప్రలోభాల వల
- మళ్లీ వైసీపీ వస్తే..అందలమంటూ అబద్ధాలు
- అది జరిగే పని కాదని..వెనక్కి తగ్గుతున్న వలంటీర్లు



రాజీనామాలు చేసి ఏం చేస్తారు? : కోరుకొండలో శుక్రవారం 64 మంది వలంటీర్ల రాజీనామా

ఎంతో కొంత చదువుకున్నారు.. ఖాళీగా ఉండలేక వలంటీర్ ఉద్యోగంలో చేరారు..గత ఐదేళ్లుగా ప్రజలకు దగ్గరయ్యారు. ప్రతి నెలా పింఛన్ డబ్బులు ఎప్పుడు తెస్తారోనని పింఛనుదారులు ఎదురు చూస్తే.. ఏ పథకం సమాచారం మోసుకొస్తారోనని సాధారణ ప్రజానీకం ఎదురుచూశారు.. జగన్ వలంటీర్లను జనానికి అంతలా అలవాటు చేశారు.. వారినే ఉపయోగించి ఎన్నికలకు వెళ్లాలని జగన్ భావించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో వలంటీర్లను విధుల నుంచి తొలగించారు.. ఇదే అదునుగా అధికార పార్టీ నాయకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు పావులు కదుపుతున్నారు.. వలంటీర్లను ఆశపెట్టి రాజీనామాలు చేయించి నయానో భయానో తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ఆరంభించారు.. నాడు కాదు.. నేడూ చదువుకున్న యువతరం జీవితాలతో ఆడుకుంటున్నారు.. ఎన్నికల వేళ ఎవరైనా వలంటీర్లు చిక్కితే.. కేసు నమోదైతే వాళ్ల జీవితం నాశనమైనట్టే సుమా.. వలంటీర్లు తస్మాత్ జాగ్రత్త..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత వలంటీర్లు ఇటీవల రాజీనామాల బాట పట్టారు. నోటిఫికేషన్‌కి ఇంకా అతి కొద్ది రోజులు సమయం ఉండగా ఆ పరంపర మరీ ఊపందుకొంది. అయితే తన సైన్యమని జగన్ చెప్పుకున్న ఉద్యోగులు/సేవకులు ఎందుకు నెల రోజుల నుంచీ ఇలా ప్రవర్తిస్తున్నారు?. పీజీలు చదివి కూడా నెలకు కేవలం రూ.5 వేలకు సేవకు వచ్చిన వలంటీర్లు సరిగ్గా ఐదేళ్ల తర్వాత.. మళ్లీ ఎన్నికల వేళ ఎందుకు ఉద్యోగాలను వదిలేస్తున్నారు?. ఏ వ్యవస్థలోనూ లేని విధంగా మూకుమ్మడిగా ఎందుకు బయటకు వెళ్లిపోతున్నారు?. వైసీపీ నాయకుల ఒత్తిడి, ప్రలోభాల చట్రంలో వలంటీర్లు నలిగిపోతున్నారని ఆ ప్రశ్నలకు జవాబులు వినవస్తున్నాయి.

త్యాగమా? స్వార్థమా?

దేశంలో ఎక్కడా లేని ఓ వ్యవస్థను జగన్ అస్తవ్యస్తంగా సృష్టించారు.లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నెలకు రూ.5 వేలు గౌరవ భృతితో ఉన్నతంగా చదువుకున్న వారిని సైతం రాజకీయ సేవ ఉచ్చులోకి లాగారు. ప్రభుత్వ ఉద్యో గాలకు నోటిఫికేషన్లు లేకపోవడంతో వలంటీరు సేవనే మహాప్రసాదంగా యువత ఎంచుకున్నారు. జాబు చార్టు, ఉద్యోగ భద్రత వంటివేమీ లేకుండా ఐదేళ్ల సమయాన్ని వైసీపీ పాలకులకు ధార పోశారు. ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే పంపిణీ పేరుతో వలంటీర్లను రాజకీయ స్వార్థం కోసం వాడు కున్నారు.ఎన్ని కల వేళ కోడ్ వచ్చిన తరువాత అయినా వదిలారా అంటే అదీ లేదు. వలంటీర్లను ఇక నేరుగా రాజకీయ ప్రయోజనాలకు వైసీపీ పాలకులు వాడుకునే ఎత్తు వేస్తున్నారు. గత ఐదేళ్లుగా కుటుంబాలతో వలంటీర్లకు ఓ మౌన అనుబంధం ఏర్పడింది. దాంతో రాజ కీయంగా లబ్ధి పొంద డానికి వైసీపీ కుతంత్రా లు పన్నుతుంద నడంలో సందేహం లేదు. ఇవన్నీ గమనిస్తున్న జనం విస్తు పోతున్నారు.

వలంటీర్లు లేకపోతే?

వలంటీర్ల గురించి పూర్తిగా తెలుసుకున్న ఎన్నికల సంఘం..వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రక్రియలో వినియోగించకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో జగన్ ఖంగుతిన్నారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో వలంటీర్లతో ఇంటింటా ప్రచారం చేయించుకుందామని జగన్ అనుకొన్నారు. కానీ దానికి ప్రజాస్వామ్యం అడ్డుకట్ట వేసింది. వలం టీర్లు లేకపోతే అసలు పాలనే ఆగిపోతుందనే విధంగా ప్రభుత్వం వలంటీర్లను పురిగొల్పింది. కానీ వలం టీర్లు లేకుండానే ఈ నెల పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. దీంతో వలంటీర్లను జగన్ ప్రతి క్షణం తన స్వార్థం కోసం మభ్యపెడుతున్నారనే విషయం బహిర్గతమైంది. వలంటీర్లకు చంద్రబాబు వ్యతిరేకం కాదు. ప్రభుత్వం నుంచీ వేతనం పొందు తున్న వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా రాజకీయం చేయడం తప్పని మాత్రమే చెబుతున్నారు. పైగా టీడీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లకు నెలకు రూ.10 వేల వేతనంతో పాటు నైపుణ్య శిక్షణ ఇస్తామంటూ హామీ ఇచ్చారు.

రాజీనామా చేస్తారా? లేదా?

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచీ వలంటీర్ల చుట్టూ రాజకీయం అల్లుకుపోయింది. గెలుస్తామనే నమ్మకం సన్నగిల్లడం, జగన్‌తో సహా వైసీపీ నాయకుల మాటలను జనం పట్టించుకోక పోవడంతో వలంటీర్ల 'సేవ'ను ఎలాగైనా ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని వైసీపీ కుట్ర పన్నుతోంది. దీనిలో భాగంగా వలంటీర్లను నయానో భయానో నలిపేస్తున్నారు. కొందరు వైసీపీ నాయకులు నేరుగానే వలంటీర్లపై బెదిరింపులకు దిగుతున్నారు. రాజీనామా చేసి తాము చెప్పినట్టు వింటే రేపు తమ ప్రభుత్వం వస్తే తిరిగి ఉద్యోగాలిస్తామని..రాజీనామా చేయని వాళ్లను తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో మానసికంగా కాస్త నెమ్మదిగా ఉన్నవాళ్లు భయపడి రాజీనామాల బాట పడుతున్నారు. వారిని చూసి మరి కొందరు ఉద్యోగాలు వదులుకుంటున్నారు. సాధారణంగా ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం కంటే మెరుగైన ఉద్యోగం లభిస్తేనో లేకపోతే ఆరోగ్య కారణాల వల్ల రాజీనామాలు చేయడం జరుగుతుంది. కానీ ఎలాంటి బలమైన కారణం లేకుండానే వలంటీర్లు గంపగుత్తగా రాజీనామాలు చేస్తున్నారు. తాత్కాలిక ప్రలోభాలకు ఆశపడి కొందరు, పాలకుల ఒత్తిడి తట్టుకోలేక మరి కొందరు, మనసు చంపుకొని ఇంకొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్టు సమాచారం. రాజీనామాలు చేసిన వారిని నేరుగా రాజకీయాల్లో వినియోగించుకోవాలని వైసీపీ యోచిస్తోంది. అలా జరిగితే జగన్ తన రాజకీయ లబ్ధి కోసమే వలంటీరు వ్యవస్థను నిర్మించుకున్నారనే విషయం నిజమని తేలుతుంది. రాజీనామాలు చేసిన వలంటీర్లను సైతం రాజకీయ ప్రక్రియకు దూరం పెట్టాలని ఇప్పటికే ఎన్నికల సంఘానికి పౌర సంఘాలు లేఖలు రాస్తున్నాయి.

తూర్పులో 700మందికిపైగా

అధినాయకత్వం మౌఖిక ఆదేశాలతో వైసీపీ నాయకులు వలంటీర్లతో రాజీనామాలు చేయించే దాష్టీకాన్ని కొనసాగిస్తున్నారు. వైసీపీ నాయకులు నేరుగా వలంటీర్ల వద్దకు వెళ్లకుండా ఇప్పటికే రాజీనామా చేసిన వాళ్లతో రాయబారం నడిపిస్తు న్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 9 వేల మంది వలంటీర్లు ఉండగా సుమారు 700 మంది వరకూ రాజీనామాలు చేశారు. రాజీనామా చేస్తే భవిష్యత్తులో బాగా 'చూసుకుంటామని', రాజీనామా చేసిన వాళ్లు తాము చెప్పినట్లు చేస్తే నెలకు రూ.25 వేల వరకూ అనధికారికంగా ముట్టజెబుతామని ఆశ పెడుతున్నారు. అయితే ఇక్కడ ఓ విషయం నిగూఢంగా దాగి ఉండడం గమనార్హం. జిల్లాలో 9వేల మంది వలంటీర్లకు పది శాతం మంది కూడా రాజీనామా బెదిరింపులకు లొంగలేదనే విషయం సుస్పష్టం. వైసీపీ ప్లాను పనైపోయిందని ప్రజలతో పాటు వలంటీర్లకు కూడా బోధపడడంతో చాలా మంది వలంటీర్లు రాజీనామాలను తిరస్కరిస్తున్నారని సమాచారం. చంద్రబాబు సీఎం అయితే తమ జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని విశ్వసిస్తుండడమే ఇందుకు కారణం.

గ్యాస్ నొప్పి అనుకున్నాడు..

గుండెపోటుతో హోంగార్డు మృతి



కెల్లా సురేంద్ర

రాజానగరం, ఏప్రిల్ 13 : గుండె వద్ద పోటు వస్తోం ది.. అయినా విధులకు వెళ్లే కంగారు..ఏం కాదులే గ్యాస్ నొప్పి అనుకున్నాడు..ఎందుకంటే అతనికి కేవలం 36 ఏళ్లు.. అయితే మోటార్ సైకిల్‌పై అలా విధులకు వెళ్లాడో లేదో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు..రాజానగరం గ్రామానికి చెందిన కెల్లా సురేంద్ర(36) రాజమహేంద్రవరంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై డ్యూటీకి బయలుదేరాడు. ఇంటి వద్ద ఛాతిలో నొప్పిరావడంతో గ్యాస్ నొప్పిగా భావించి లెక్క చేయలేదు. రాజమహేంద్రవరం చేరుకునే సరికి నొప్పి అధికం కావడంతో పోలీసులు,తోటి ఉద్యోగులు హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.సురేంద్ర మరణవార్త విన్న భార్య హతాశు రాలైపోయింది..ఇప్పుడే కదా నా కళ్లెదుటే వెళ్లారు..ఇలా ఎలా జరిగిందంటూ కంగారుపడిపోయింది. భర్త అచేతనంగా పడి ఉండడం చూసి కన్నీటి పర్యంతమైంది. నొప్పి అంటే గ్యాస్ నొప్పి అనుకున్నాను ఇలా జరుగుతుందనుకోలేదని బోరున విలపించింది. తోటి ఉద్యోగులు, స్నేహితులు రాజానగరం చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు. కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు పెద్దలు డిమాండ్ చేశారు.



వాహనం వస్తే.. ఆగాల్సిందే..!

ఎన్నికల వేళ..ముమ్మర తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి.. ఎన్నికల్లో భాగంగా జిల్లా సరిహద్దు.. ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కార్లు, భారీ వాహనాలను తనికీ చేస్తున్నారు. అనుమానం వస్తే ద్విచక్రవాహనదారులను ఆపి తనికీ చేస్తున్నారు. రూ. 50 వేలు మించి నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాలని చెబుతున్నారు. ఇప్పటికే కడియం మండలం పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ పట్టుకుంటూనే ఉన్నారు. గురువారం రాగి వస్తువులు, చీరలు పట్టుకున్నారు. శుక్రవారం ఒక కంటైనర్‌లో తరలిస్తున్న బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరులోనూ గతంలో నగదు పట్టుకున్నారు. ఇలా స్పెషల్ స్క్వాడ్ ముమ్మర తనికీలు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో శనివారం సిబ్బంది పలు వాహనాలు తనికీ చేశారు. - రాజమహేంద్రవరం సిటీ

కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి 'అవంతి' దాతృత్వం

రూ.10 లక్షలతో ఆధునీకరణ పనులు



కొవ్వూరు ఆసుపత్రిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఇంద్రకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 13: కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో సుమారు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు అవంతీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతలో భాగంగా రూ.10 లక్షలతో ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, మెటర్నిటీ వార్డు, నవజాత శిశువు గది పునరుద్ధరణ పనులతో పాటు వాటికి ఎయిర్ కండీషనింగ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, అవంతీ ఫీడ్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరమ్మ ఆలయంలో అన్నదానం

కొవ్వూరు, ఏప్రిల్ 13: కొవ్వూరు గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉగాది సందర్భంగా కొవ్వూరమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారం ముగిసాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అన్నదానంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కొవ్వూరులో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి, నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 13: బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా హోంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కొవ్వూరు సత్యవతినగర్‌లోని శాంతివెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్ థెరిస్సా హోంలో యునైటెడ్ స్ట్రెంగ్ (మాల) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరాన్ని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నాయకులు సందర్శించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవల్లి, కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు కె.సాయికిరణ్, కప్పల రాజేష్, జి.రవి, బి.ప్రవీణ్, ప్రసాద్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శీని ప్రసాద్ ప్రథమ వర్ధంతి

కొవ్వూరు, ఏప్రిల్ 13 : మండలంలోని వేములూరులో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ శీని ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మరపట్ల కళాధర్ చక్రవర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అక్కిన రాంబాబు, శీని సుదర్శనం, ముళ్ళపూడి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మి, తుమ్మిడి రామలక్ష్మి, బంబోతు సురేష్, బిక్కిన శ్రీను పాల్గొన్నారు.

పైడిమెట్టలో చలివేంద్రం



వృద్ధులకు మజ్జిగ అందిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి, ఏప్రిల్ 13: మండలంలోని పైడిమెట్ట గ్రామంలో నందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని తహశీల్దార్ శ్రీనివాసరావు ప్రారంభించారు. రానున్న రెండు నెలలు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, కుండల్లో ఉంచిన చల్లటి నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల, ఫౌండేషన్ ప్రతినిధులు దేవరపల్లి రవి, చంద్రశేఖర్, ఆలీ, జస్వంత్, విజయ్, కుమారి పాల్గొన్నారు.

సర్వే తోటలో అగ్నిప్రమాదం

తాళ్లపూడి, ఏప్రిల్ 13: మండలంలోని గజ్జరం గ్రామంలో శనివారం సర్వే తోటలో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామంలోని రైతు కేసిరాజు రవిచంద్రకుమార్‌కు చెందిన 10 ఎకరాల భూమిలో సర్వేతోట ఉంది. శనివారం మధ్యాహ్నం తోట దగ్ధమైందని, సుమారు ఐదెకరాల్లో తోట కాలిపోయిందని, రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రూ. 59,500 నగదు సీజ్

కొవ్వూరు, ఏప్రిల్ 13: ఎన్నికల కమిషన్ నిబంధనలను విరుద్ధంగా తరలిస్తున్న రూ.59,500 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. నిడదవోలు నుంచి కొవ్వూరు కారులో సరైన పత్రాలు చూపకుండా వ్యాపారి తరలిస్తున్న రూ.59,500 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీము స్వాధీనం చేసుకున్నారన్నారు.

వ్యవస్థలను అడ్డు పెట్టుకుని నిరంకుశ పాలన

దేవరపల్లి, ఏప్రిల్ 13: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని నిరంకుశంగా పాలన కొనసాగిస్తున్నదని రాజమహేంద్రవరం లోక్‌సభ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. దేవరపల్లిలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్ళు, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అవినీతి, అక్రమ పాలన చేశాయన్నారు. సీఎం జగన్ అనేక చీకటి జీవోలు తెచ్చి అరాచకంగా పాలించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 13 లక్షల ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గోపాలపురం అభ్యర్థి మార్టిన్‌లూథర్, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణ, నాయకులు వెలగా రామకృష్ణ, కాకర్ల శ్రీహరిబాబు, జ్యేష్ఠ సతీష్‌బాబు, శారదాదేవి, ఆకుల సౌభాగ్యలక్ష్మి, సీపీఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, కే.రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు

దేవరపల్లి, ఏప్రిల్ 13: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగురికి స్వల్ప గాయాలైనట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని కర్నూల్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో బస్సులో 27 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయని, వారిని అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. దీనిపై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

ఐక్యతతో టీడీపీని గెలిపించాలి

నల్లజర్ల, ఏప్రిల్ 13: అందరూ కలిసి సమష్టిగా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గన్ని వీరాజనేయులు అన్నారు. శనివారం స్థానిక ప్రియాంక కన్వెన్షన్ హాలులో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు సమక్షంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. కుటుంబంలో కలహాలు వస్తే పరిష్కరించుకున్నట్టే పార్టీలో చిన్నచిన్న విభేదాలు రావడంతో వాటిని పరిష్కరించుకున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని వెళ్లాలని మద్దిపాటికి సూచించారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరిన పోలింగ్ సామగ్రి

- బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ భద్రం
- కొవ్వూరులో 176, నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాలు

కొవ్వూరు, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు పార్లమెంటు, అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి అన్ని బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్‌లను విజయవంతంగా స్ట్రాంగ్‌రూమ్‌లో పెట్టి సీలు వేసినట్టు కొవ్వూరు ఆర్వో, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక సంస్కృత ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులు సమక్షంలో, పోలీసు భద్రత మధ్య పోలింగ్ సామగ్రిని స్ట్రాంగ్‌రూమ్‌లో పెట్టి సీలు వేశామన్నారు. ఈ సందర్భంగా శ్రీవాస్తవ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోవు జిల్లా కేంద్రం నుంచి ఈవీఎంలను కొవ్వూరు తీసుకొచ్చామని, కొవ్వూరు నియోజకవర్గంలో 176 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పార్లమెంటు, అసెంబ్లీలకు సంబంధించి 422 బ్యాలెట్ యూనిట్లు, 422 కంట్రోల్ యూనిట్లు, 456 వీవీ ప్యాట్ యూనిట్లు స్థానిక సంస్కృతోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి, సీలు వేసినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు.

బాలికల జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్

నిడదవోలు, ఏప్రిల్ 13: నిడదవోలు నియోజకవర్గ అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఈవీఎం యూనిట్స్, వీవీ ప్యాడ్స్ శనివారం సాయంత్రం నిడదవోలు బాలికల జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రమణనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలోని 205 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిజర్వ్ యూనిట్స్‌తో కలిపి 246 బ్యాలెట్ యూనిట్స్, 246 కంట్రోల్ యూనిట్స్, 266 వివి ప్యాడ్స్ స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరచి సీల్ వేసినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వి.నాగభూషణం, పోలీస్ అధికార్లు ఉన్నారు.

అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలు

అనపర్తి, ఏప్రిల్ 13: వచ్చే నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు వినియోగించే ఈవీఎంలు



నిడదవోలులో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన అధికారులు



కొవ్వూరులో పోలింగ్ సామగ్రిని భద్రపరుస్తున్న దృశ్యం

శనివారం అనపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నాయి. వీటిని రాజకీయ నాయకుల సమక్షంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీలు వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఆర్వో మాధురి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిజర్స్ యూనిట్స్‌తో కలిపి పార్లమెంట్ అసెంబ్లీ యూనిట్స్ 273, కంట్రోల్ యూనిట్స్ 273 బ్యాలెట్ యూనిట్స్, 296 వీవీ ప్యాట్స్ చొప్పున అనపర్తికి చేరుకున్నాయని, వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీలు వేసినట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ శివగణేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ పార్టీలకు చెందిన నాయకులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రాజానగరంలో 216 పోలింగ్ కేంద్రాలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 13: రాజానగరం అసెంబ్లీ సెగ్మెంట్, పార్లమెంట్‌కు సంబంధించి అన్ని బాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ పాట్స్ విజయవం తంగా స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచి సీలు వేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో పోలీసు భద్రత మధ్య రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీలు వేశామన్నారు. నియోజక వర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రిజర్వ్ యూనిట్లతో కలిపి 259 బ్యాలెట్ యూనిట్‌లు, 259 కంట్రోల్ యూనిట్‌లు, 280 వీవీ ప్యాట్స్ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచామని పేర్కొన్నారు.



అనపర్తి జడ్పీ హైస్కూల్లో ఈవీఎమ్‌లను భద్రపరచి సీల్ వేసిన ఆర్వో

నిడదవోలు అభివృద్ధి దుర్గేష్‌తోనే సాధ్యం

- టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు

నిడదవోలు, ఏప్రిల్ 13: నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా కందుల దుర్గేష్‌కే ఉందని టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నిడదవోలులో టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీగా అపారమైన అనుభవం కలిగిన దుర్గేష్ నిడదవోలు అభ్యర్థిగా నిలబడడం నియోజకవర్గ అభివృద్ధికి తొలి మెట్టు అని కొమ్మిన అన్నారు. ఓటర్లు గాజు గ్లాసు గుర్తుపై దుర్గేష్‌కు, కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి ఓటేసి గెలిపించాలన్నారు. కాగా 21వ వార్డులో ఎన్నికల ప్రచారం సందర్భంగా దుర్గేష్ ఒక ఇంటి ముందుకు వచ్చేసరికి దోశలు వేస్తుండడంతో ఆయన గరిట అందుకుని దోశలు వేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, బూరుగుపల్లి శ్రీనివాస్, రంగా రమేష్, బండి సత్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

పెరవలి: కూటమి నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి మద్దతుగా మండలంలోని కానూరు, నడిపల్లి, తీపర్రు, పెరవలి,



నిడదవోలులో ప్రచారం నిర్వహిస్తున్న కందుల దుర్గేష్

ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గాజు గ్లాస్, కమలం గుర్తులపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కానూరులో వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజు, తీపర్రులో కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, కంకిపాటి ప్రసాద్‌కుమార్, పెరవలిలో సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, పిప్పర రవి, ఖండవల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ, రవివర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కు నడుం బిగించాలి : రాజేష్

తాళ్లపూడి, ఏప్రిల్ 13: రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ నడుం బిగించాలని జరుగనున్న సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామంలో పోరాటం జరపాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని అన్నదేవరపేటలో శనివారం ఓ వివాహ కార్యక్రమానికి వచ్చిన ఆయన టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య గృహానికి విచ్చేసి మాట్లాడారు. రేపటి భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని, కూటమి నాయకులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పిల్లి ప్రకాష్ రాజు, పులిదిండి నాని, కృష్ణ మోహన్, సత్యేంద్ర, గణపతి, భరత్ పాల్గొన్నారు.



అన్నదేవరపేటలో టీడీపీ నాయకులతో మహాసేన రాజేష్

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : గోరంట్ల



కూటమి అభ్యర్థి గోరంట్లను సత్కరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

కడియం, ఏప్రిల్ 13: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని మురమండలో జరిగిన కూటమి ఆత్మీయ సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలంటే విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబుతోను సాధ్యమన్నారు. కూటమి అధికారమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు దళితులు టీడీపీలో చేరారు. వారికి గోరంట్ల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఆయనను టీడీపీ, జనసేన శ్రేణులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, వట్టికూటి జానకీరామ్, దేవళ్ళ రామ్మోహనరావు, గారపాటి సురేంద్ర, గద్దే శ్రీధర్, గద్దే చిన్నా, పోతుల వీర్రాజు, నల్లూరి రామకృష్ణ, నందమూరి సూరిబాబు, గారపాటి శ్రీను, మరిడి సత్యనారాయణ భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ, జనసేన మండలాధ్య క్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: రాజవోలులో నిమ్మలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో గోరంట్ల బుచ్చియ్యచౌదరి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే పాలన మారాలన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కూటమి విజయానికి కృషి చేయాలి : నల్లమిల్లి

అనపర్తి/బిక్కవోలు, ఏప్రిల్ 13: కూటమి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనపర్తి టికెట్‌పై సందిగ్ధతకు దాదాపుగా తెరపడిందని, 30 రోజులు మాత్రమే గడువు ఉన్నందున పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. కాగా అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా బరిలో నిలువనున్న రామకృష్ణారెడ్డి మండలంలోని తొస్సిపూడిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి పోటీ చేస్తుండడంతో స్థానిక గణపతి ఆలయంలో రెండు పార్టీల తరపున ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకుడు టి.సత్యనారాయణ, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం'

గోకవరం, ఏప్రిల్ 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దాడులు మరింత పెరిగాయని పలువురు దళిత నాయకులు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, రంపయర్రం పాలెం, గంగంపాలెం గ్రామాల్లో శనివారం దళితగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దళిత నాయకులు ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే దళితులకు తగిన న్యాయం, రక్షణ లభిస్తాయన్నారు. రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూను, కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌ను గెలిపించాలని వారు అభ్యర్థించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మంగరౌతు రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గునుపే భరత్, బాదంపూడి ప్రకాష్, హర్షిత, మొర్త చిట్టిబాబు, ఈది అశోక్, కొంగరపు రాజు, గున్నూరి లాజరు, సాంబత్తుల చంద్రశేఖర్, జి.రాంబాబు పాల్గొన్నారు.

త్యాగధనుల ఉద్యమ కృషి స్ఫూర్తిదాయకం

కడియం, ఏప్రిల్ 13: సంక్షేమ, విజ్ఞాన, సమ సమాజం కోసం జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్, కోశాధికారి ఈ వీవీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. శనివారం వేమగిరిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమం కోసం కృషి చేసి న చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, ఏవీ సూర్యనారాయణ రాజుతో పాటు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.అబ్బాయి, వేదుల శాస్త్రి, ఎస్.అనిత, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ డిక్లరేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరంలో క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా శిక్షణ ఇప్పించేందుకు స్పోర్ట్స్ డిక్లరేషన్ ప్రకటిస్తున్నానని టీడీపీ-జనసేన-బీజేపీ సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో స్పోర్ట్స్ డిక్లరేషన్ ప్రకటించారు. రాజమండ్రికి చెందిన క్రీడాకారుల కోసం వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. క్రీడలకు ప్రాధాన్యమివ్వకుండా జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. క్రీడలకు క్యాపిటల్ సంగతి ఎలా ఉన్నా వైసీపీ నేతలు మాత్రం డ్రగ్స్‌కు క్యాపిటల్‌గా మార్చేశారని మండిపడ్డారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో పెద్ద కామిక్ షో చేశారని టెన్నిస్‌బాల్‌ని బ్యాట్‌తో కొడితే బ్యాట్ విరిగిపోయిందన్నారు.

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణ సభ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో ఈ నెల 15వ తేదీన లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన రెండు పార్టీల ఉమ్మడి సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు హాజరవుతారని తెలిపారు.

భరత్‌రామ్ తీరుతో వైసీపీకి రాజీనామా

- కూటమి అభ్యర్థి ఆదిరెడ్డికే మా మద్దతు
- జిల్లా మాజీ కార్యదర్శి గుడె రఘునరేష్



సమావేశంలో మాట్లాడుతున్న రఘునరేష్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరం వైసీపీలో ఎంపీ భరత్‌రామ్ తీరుతో విసుగు చెందే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ జిల్లా మాజీ కార్యదర్శి గుడె రఘునరేష్ ప్రకటించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసీపీలో సీనియర్లకు గౌరవం లేదన్నారు. 2019 ఎన్నికల్లో భరత్‌రామ్ విజయానికి ఎంతగానో కృషి చేశామని, అతను గెలిచాక తామెవరో తెలియనట్టుగా ఉన్నారని విమర్శించారు. నగరంలో వైసీపీ కోఆర్డినేటర్లను వరుసగా మార్పించి పార్టీ బలహీనపడేలా చేశాడన్నారు. గతంలో తామంతా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో పాటు వైసీపీలో చేరామన్నారు. ఆటుపై షర్మిళారెడ్డి తమను గుర్తించారన్నారు. కానీ భరత్‌రామ్ మాత్రం తమను పట్టించుకోలేదన్నారు. ఆరు నెలలుగా పార్టీలో ఉన్న నేతలు సమస్య చెప్పినా భరత్ తీరు మారలేదన్నారు. అతనితో కలిసి పయనించలేక వైసీపీకి రాజీనామా చేసినట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ముత్యాల పెదబాబు, ముమ్మిడి వీరబాబు, గొలుగూరి సూర్రెడ్డి, ఇంటి దొరబాబు, ర్యాలి రామకృష్ణ, మహిళా విభాగం నాయకురాలు గోపిశెట్టి విజయలక్ష్మి, కుప్పిలి శంకరరెడ్డి, పినిశెట్టి మూర్తి, రెడ్డి రమణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లవరంలో అగ్నిప్రమాదం

గోకవరం, ఏప్రిల్ 13: మండలంలోని మల్లవరంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గుర్రం నిర్మలకు చెందిన తాటాకిల్లులో నిర్వహిస్తున్న హోటల్, బొదిరెడ్డి అన్నాయబ్బుకు చెందిన మూడెకరాలన్నర పొలంలోని గడ్డివాము కాలి బూడిదయ్యాయి. హోటల్ సామగ్రితో పాటు, మంచం బీరువాలు తదితర గృహ సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్థులు కోరుతున్నారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ పరామర్శించారు.

సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13: సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠోత్సవం 3వ వార్డు సుబ్బారావుపేటలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, అఖండ దీపస్థాపన ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తారన్నారు. సోమవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. పిడింగొయ్యి గ్రామంలోని శ్రీకోదండరామాలయం వద్ద శనివారం ఉదయం పందిరిరాట మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. 17న సీతారామ కల్యాణం జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో నక్కా నగేష్, బళ్ళా శ్రీనివాసరావు, పల్లా వెంకటేశ్వరరావు, కేబుల్ శ్రీనివాస్, తెల్లమేకల సత్యనారాయణ దంపతులు, కమిటీ సభ్యులు సూరారావురెడ్డి, వై.దుర్గ, కాదా సత్యనారాయణరావు, టి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ దాడి

రంగంపేట, ఏప్రిల్ 13: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లో సారా తయారీ, మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాంబాబు శనివారం తెలిపారు. మండలంలోని అచ్యుతాపురంలో సారా తయారు చేస్తున్న కురుకూరి శ్రీను, అంచూరి రామాంజనేయులును అరెస్టు చేసి వారి నుంచి 145 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే ఈలకొలనులో సారా తయారీ చేస్తున్న గుత్తుల సూరిబాబును అరెస్టు చేసి, 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



రంగంపేటలో పూజలు చేస్తున్న మల్లేష్ దంపతులు

రంగంపేట, ఏప్రిల్ 13: రంగంపేటలో మంచినీటి చెరువు వద్ద గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం జరిపారు. నక్క మల్లేష్‌దుర్గాదేవి దంపతులతో పురోహితులు ప్రత్యేక పూజలు చేయించి కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్దాంతపు సత్తిబాబు, దార్ల అమ్మిరాజు, గరగడాల నాగేంద్రబాబు, దవరసింగ్ వెంకటరమణ, కొత్తుర్తి సత్తిబాబు, ర్యాలి బాబి, ఎ.శ్రీను పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1: లవ్‌గురు
వై.స్క్రీన్2 : ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి) : మంజుమ్మల్ బాయ్స్
అనన్య : డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్ : డీజే టిల్లు-2
రాధాకృష్ణ : ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి : గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్ : ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 : భీమా
స్క్రీన్ 2 : ప్రేమలు
శ్రీనివాస : గామి